Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

గురువారం | 12-11- 2026 | సంపుటి: 17, సంచిక: 222, పేజీలు: 12, వెల: 3/-

గడి బురుజు మన చారిత్రక

వారసత్వ సంపద



3

భూకబ్జా ప్రయత్నాలను అడ్డుకుంటాం..

వీఎల్‌టీ రద్దు చేయాలి: ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

అఖిలపక్ష ప్రజా సంఘాలతో కలిసి పరిరక్షణకు ఐక్య పిలుపు



భూ రీసర్వేను కలెక్టర్లు నిరంతరం

పర్యవేక్షించాలి

రైతులకు అవగాహన కల్పించి, భూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చొరవ చూపాలి

సర్వే అనంతరం అభ్యంతరాల స్వీకరణపై రైతులకు స్పష్టతనివ్వాలి

నోటీసుల జారీ తర్వాత ప్రతి 15 రోజులకు గ్రామాల్లో చాటింపు నిర్వహించాలి

వారం రోజుల్లో మరో 400 రోవర్ల ఏర్పాటు

రీసర్వే ఎస్ఓపీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి స్పష్టమైన మార్గదర్శకాలు

పాలేరు నియోజకవర్గంలోని 141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాతిపదికన రీసర్వే

22ఎ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి - ఐదు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్స్

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే

తరువాయి 2వ పేజీలో...

మూసీ ప్రక్షాళనకు

తొలి అడుగు

21 కిలోమీటర్ల మేర పనులకు త్వరలో శ్రీకారం

హైదరాబాద్ భవిష్యత్తు తరాల కోసం చెరువుల పరిరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం

తమ్మిడికుంట అభివృద్ధితో పర్యావరణ పరిరక్షణకు కొత్త దిశ

14 ఎకరాల నుంచి 30 ఎకరాలకు విస్తరించిన చెరువు.. నాగార్జునకు సీఎం అభినందనలు

ఆక్రమణలతో కనుమరుగైన చెరువులు.. ప్రకృతి విధ్వంసానికి అడ్డుకట్ట వేయాల్సిందే: సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

చెరువులు కేవలం నీటి నిల్వ కేంద్రాలు కాదు.. నగరానికి ఊపిరి పోసే జీవనాడులు! వాటిని కబ్జాలపాలు చేసి, సహజ నీటి ప్రవాహ మార్గాలను ధ్వంసం చేస్తే ప్రకృతి ప్రకోపానికి నగరాలు బలికాక తప్పదనే వాస్తవాన్ని హైదరాబాద్ అనేకసార్లు చవి చూసింది. చెరువులు మాయమవుతుంటే వరదలు పెరుగుతున్నాయి.. నాలాలు కుంచించుకుపోతుంటే రహదారులు జలమయమవుతున్నాయి.. ప్రకృతి వనరులపై మానవుడి అత్యాశ నగర జీవనాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపుతూ హైదరాబాద్ నగర భవిష్యత్తు తరాల కోసం చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మాదాపూర్‌లో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును ముఖ్యమంత్రి ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నటుడు అక్కినేని నాగార్జున, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



14 ఎకరాల నుంచి 30 ఎకరాలకు విస్తరణ: గతంలో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ్మిడికుంట చెరువును ప్రస్తుతం 30 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయడం నగర పర్యావరణ పరిరక్షణలో కీలక ముందడుగు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కోసం దాదాపు రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అందించిన సినీ నటుడు అక్కినేని నాగార్జునను ప్రత్యేకంగా అభినందించారు. సమాజానికి తిరిగి మేలు చేయాలనే ఆలోచనతో భూమిని అందించడం గొప్ప విషయ మని, తెరపై మాత్రమే కాకుండా నిజ జీవితంలోనూ నాగార్జున నిజమైన హీరోగా నిలిచారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి మాత్రం ఇష్టారాజ్యం!

ఐనవోలులో రాత్రి 10 దాటినా మద్యం విక్రయాలా?

- షాపు చేతిలో ఉంటే దొరలమనే ఫీలింగ్

10:19 గంటలకు తెరిచే ఉన్న రాజరాజేశ్వరి వైన్స్.. 10:21 గంటలకు ఫోన్‌పే లావాదేవీ!

లైసెన్స్ నంబర్ అడిగితే ఎగతాళి.. నిబంధనలు పాటించాలంటే ఎందుకీ నిర్లక్ష్యం?

చుట్టూ పక్కల మద్యం సేవించే సామాన్యులపై రైడింగ్ చేసే వాళ్ళు..

ఖద్దరుచొక్కాల తప్పులపై అంత కఠినం ప్రదర్శించేనా?



ప్రజా కలం ప్రత్యేకం..

ఐనవోలు, నవంబర్ 11 (ప్రజాకలం ప్రత్యేక కథనం):

చట్టాలు సామాన్యులకేనా? నిబంధనలు వ్యాపారులకు వర్తించవా? ప్రభుత్వ అనుమతితో వ్యాపారం నిర్వహిస్తున్నామనే పేరుతో నమయపాలనను గాలికి వదిలేయవచ్చా? ఇతరులకు నీతులు చెప్పే ముందు తాము పాటించాల్సిన నిబంధనలు గుర్తుండాలి కదా! ఐనవోలు మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి వైన్స్ వ్యవహారం ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి మద్యం దుకాణాలు మూసివేయాల్సి ఉండగా, ఐనవోలులో మాత్రం రాత్రి సమయం దాటినా విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి నవంబర్ 11వ తేదీ రాత్రి 10:19 గంటలకు తీసిన ఫొటోలో దుకాణం వద్ద కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు, పలువురు వ్యక్తులు ఉన్నట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా అదే రోజు రాత్రి 10:21 గంటలకు రాజరాజేశ్వరి వైన్స్ పేరుతో ఉన్న ఫోన్‌పే ఖాతాకు రూ.180 చెల్లించినట్లు లావాదేవీ రసీదు కూడా అందుబాటులో ఉంది. ఒకవైపు రాత్రి 10:19 గంటలకు దుకాణం వద్ద పరిస్థితి.. మరోవైపు 10:21 గంటలకు జరిగిన డిజిటల్ చెల్లింపు.. ఈ రెండు ఆధారాలు ఇప్పుడు మద్యం విక్రయాల నమయపాలనపై అనుమానాలకు తావిస్తున్నాయి. అయితే ఆ చెల్లింపునకు ప్రతిగా మద్యం విక్రయించారా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

లైసెన్స్ నంబర్ తెలియదని ఎగతాళి చేసే వారికి సమయపాలన తెలియదా?

మద్యం దుకాణం లైసెన్స్ నంబర్ తెలియదని ప్రశ్నించిన వారిని ఎగతాళి చేయడం ఎంతవరకు సమంజసం? లైసెన్స్ నంబర్ అడిగిన వారిపై పరిహాసం చేయడం కంటే, నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహిస్తున్నామని నిరూపించుకోవడం ముఖ్యం కాదా? షాపు నిర్వహణ చేతిలో ఉందని దొరల్లా వ్యవహరించడం, ప్రశ్నించే వారిని చిన్నచూపు చూడడం ఏ విధమైన వ్యాపార సంస్కృతి?లైసెన్స్ అనేది ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి ఇచ్చిన అధికారం కాదు.

తరువాయి 2వ పేజీలో...

దావోస్ తరహాలో ప్రపంచ విధాన చర్చలకు

హైదరాబాద్ వేదిక

- ప్రజాస్వామ్య పరిరక్షణకు హైదరాబాద్ వేదికగా భారత్ సమ్మిట్-2

- అహింస, అలీన విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలే ప్రపంచానికి మార్గదర్శకాలు

- ఈనెల 13, 14న హైదరాబాదులో భారత్ సమ్మిట్ 2026 నిర్వహణ

- ప్రజాస్వామ్య పరిరక్షణ, అహింస, అలీన విధానాలే సమ్మిట్ ప్రధాన అజెండా

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

ప్రపంచ ఆర్థిక, పెట్టుబడుల విధానాలపై చర్చలకు దావోస్ అంతర్జాతీయ వేదికగా గుర్తింపు పొందినట్లే.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే భారత్ సమ్మిట్ 2026తో రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలపై ప్రపంచానికి దిశానిర్దేశం చేసే అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్ ఎదగనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న హింస, విద్వేష రాజకీయాలు, విభజన ధోరణుల నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు హైదరాబాద్‌లో నవంబర్ 13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్-2 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు, ఉదారవాదులు, ప్రగతిశీల భావాలు కలిగినవారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ప్రపంచానికి నూతన దిశానిర్దేశం చేయాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో భారత్ సమ్మిట్-2 విజయవంతం చేయడానికి నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు 70కిపైగా దేశాల నుంచి

తరువాయి 2వ పేజీలో...



రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ఎల్మినో ప్రకృతి విపత్తు.. రాజకీయం తగదు:

ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు

కాంగ్రెస్‌లో చేరిన పెద్దబొంకూరు మాజీ ఉపసర్పంచ్,వార్డు సభ్యులు

పెద్దపల్లి,నవంబర్ 11: (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు,ప్రజా పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రభుత్వ విప్,శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్

తరువాయి 2వ పేజీలో...

భారత్ సమ్మిట్ కాదు..

యాంటీ భారత్ సమ్మిట్!

6 గ్యారెంటీలు అమలు చేయకుండా రాహుల్, ప్రియాంక

తెలంగాణలో అడుగుపెడితే అడ్డుకుంటాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు



హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన 'భారత్ సమ్మిట్ అసలు భారత్ సమ్మిట్టే కాదని, అది ముమ్మాటికీ దేశద్రోహ శక్తులు కూడబలుక్కుని ప్రోగ్రెసివ్ అలయెన్స్ నడుపుతున్న 'యాంటీ భారత్ సమ్మిట్' అని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అంతర్జాతీయ కుట్ర శక్తుల అండతో రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా రీలాంచ్ చేసేందుకే ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జార్జ్ సోరోస్, ప్రోగ్రెసివ్ అలయెన్స్ కనుసన్నల్లో దేశంలో అలజడి, అరాచకాలు సృష్టించే 'రెజీమ్ చేంజ్' కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తొలుత ఇది తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సు అనుకున్నారని, కానీ గత రెండు రోజులుగా సల్మాన్ ఖుర్షీద్, చికాగో నుంచి శామ్ పిట్రోడా చేసిన ట్వీట్లను గమనిస్తే ఇది కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విదేశీ శక్తులతో కలిసి చేస్తున్న కుట్రపూరిత సమావేశమని బట్టబయలైందని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

కేటీఆర్ రాకతో గులాబీమయమైన నిర్మల్

- 'రైతు గర్జన'తో హోరెత్తిన ఎన్టీఆర్ స్టేడియం



నిర్మల్, నవంబర్ 11 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) రాకతో నిర్మల్ జిల్లా కేంద్రం గులాబీమయంగా మారింది. బుధవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ బీఆర్ఎస్ ఇంచార్జ్ రామ్ కిషన్ రెడ్డి నిర్వహించిన 'రైతు గర్జన' బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా రైతులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పట్టణమంతా గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలతో పండుగ వాతావరణం నెలకొంది.

కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ఎండగట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎరువులు, విత్తనాల కొరత, సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వైఫల్యాలపై ధ్వజమెత్తుడు

నిర్మల్ స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పై కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలిచిన మహేశ్వర్‌రెడ్డి ప్రజలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత హోదాలో బిజీగా ఉంటూ నిర్మల్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

కేటీఆర్ పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం...కేటీఆర్ రాక సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహిస్తూ ఘన స్వాగతం పలికాయి. సభ విజయవంతం కావడం, కేటీఆర్ ప్రసంగానికి విశేష స్పందన లభించడంతో జిల్లా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 'రైతు గర్జన' సభ విజయంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది.

మూసీ ప్రక్షాళనకు తొలి అడుగు

మొదటి పేజీ తరువాయి...

చెరువు అభివృద్ధి అంటే కేవలం కట్టలు నిర్మించడం, పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం మాత్రమే కాదని, ప్రకృతికి తిరిగి జీవం పోయడమేనని సీఎం అభిప్రాయపడ్డారు. చెరువులు ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని, కాలుష్యం తగ్గుతుందని, ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని వివరించారు.

చెరువుల కనుమరుగుతో నగరానికి ముప్పు:

ఒకప్పుడు సరస్సులు, చెరువులు, రాతి నిర్మాణాలతో హైదరాబాద్ అందమైన నగరంగా గుర్తింపు పొందిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకప్పుడు సుమారు 1,372 చెరువులు ఉండగా, వివిధ కారణాలతో దాదాపు సగం చెరువులు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురికావడం వల్లే వర్షాకాలంలో వరదలు, ట్రాఫిక్ సమస్యలు, ప్రజల ఆస్తులకు నష్టం వంటి పరిణామాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నీరు ప్రవహించాల్సిన దారులను ఆక్రమిస్తే, ఆ నీరే జనావాసాల్లోకి ప్రవేశించి విధ్వంసం సృష్టిస్తుందని హెచ్చరించారు. ప్రకృతి ప్రవాహ మార్గాలను అడ్డుకోవడం అంటే భవిష్యత్తు తరాల భద్రతను ప్రమాదంలోకి నెట్టడమేనని స్పష్టం చేశారు. చెరువుల పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయకుండా, చెరువుల విధ్వంసాన్ని చూస్తూ మౌనంగా ఉంటే రాబోయే తరాలకు నీటి వనరులే మిగలని పరిస్థితి ఏర్పడుతుందని పరోక్షంగా హెచ్చరించారు.

మూసీకి మళ్లీ జీవం పోస్తాం:

మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవం ప్రభుత్వ ప్రధాన సంకల్పమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1908లో హైదరాబాద్‌లో సంభవించిన భారీ వరదల అనంతరం అప్పటి నిజాం ప్రభుత్వం ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచనల మేరకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. ఒకప్పుడు హైదరాబాద్ నాగరికత, సంస్కృతి, ఆర్థిక అభివృద్ధికి కేంద్రంగా నిలిచిన మూసీ నది నేడు మురుగునీరు, వ్యర్థాలతో తీవ్రంగా కలుషితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ కాలుష్యం కారణంగా హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలు, ముఖ్యంగా నల్గొండ ప్రాంత రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నది ప్రక్షాళనతో పాటు పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని భరోసా ఇచ్చారు. మూసీ నది మొత్తం 55 కిలోమీటర్ల పరిధిలో ఉండగా, తొలిదశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రక్రియ, అనుమతులు పూర్తయ్యాయని వెల్లడించారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. మూసీ ప్రాజెక్టు కేవలం సుందరీకరణ కార్యక్రమం కాదని, నదికి పునరుజ్జీవం కల్పించే బృహత్తర కార్యక్రమమని వివరించారు.

వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట!

తమ్మిడికుంటను కేవలం సందర్శనా స్థలంగా కాకుండా పర్యాటక, సామాజిక, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మహిళలు, కుటుంబాలు, ఐటీ ఉద్యోగులు సురక్షితంగా సందర్శించేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, హైడ్రా కమిషనర్‌లకు సూచించారు. నిర్మాణాలు చేపట్టడం ఎంత ముఖ్యమో, వాటిని నిరంతరం పరిశుభ్రంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల మహిళలకు చిన్నచిన్న స్టాళ్లు ఏర్పాటు చేసి, వారు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. తద్వారా మహిళలకు ఉపాధి లభించడంతో పాటు స్థానికంగా లేక్ ఎకానమీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలు సాయంత్రం వేళల్లో కుటుంబాలతో కలిసి గడిపేలా సౌకర్యాలు కల్పించాలని, ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయడా నికి బదులుగా 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అనే విధంగా అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని వినూత్న సూచన చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలకు వేదికగా చెరువు

నగరానికి వలస వచ్చిన గ్రామీణ ప్రజలు తమ పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు దూరం కాకుండా తమ్మిడికుంట పరిసరాలను సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం సూచిం చారు. జమ్మి చెట్లను పెంచడంతో పాటు దసరా పండుగ సందర్భం గా అలాయ్ బలాయ్ వంటి కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్రాంతి సందర్భంగా పతంగుల పండుగ వంటి కార్యక్రమాలకు కూడా ఈ ప్రాంతాన్ని వేదికగా మార్చాలని తెలిపారు. ప్రకృతితో పాటు మన సంస్కృతిని కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట.. అభివృద్ధికి బాట!

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే రహదారులు, భవనాలు, ఐటీ సంస్థల అభివృద్ధితోనే సరిపోదని, చెరువులు, నదులు, పచ్చదనం కూడా సమానంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి మాత్రం ఇష్టారాజ్యం!

మొదటి పేజీ తరువాయి...

అది ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం నిర్వహించాల్సిన అనుమతి మాత్రమే. సమయపాలన పాటించడం ప్రతి లైసెన్స్‌దారుడి బాధ్యత.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?


ఇంత స్పష్టమైన సమయాలతో కూడిన ఫొటో, డిజిటల్ చెల్లింపు ఆధారం అందుబాటులో ఉన్న నేపథ్యంలో సంబంధిత ఎక్సైజ్ అధికారులు ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. దుకాణంలోని సీసీ కెమెరాల దృశ్యాలు, విక్రయాల రికార్డులు, ఫోన్‌పే లావాదేవీల వివరాలను పరిశీలించాలి.

నిర్ణీత సమయం తర్వాత నిజంగానే మద్యం విక్రయాలు జరిగాయా లేదా అన్నది నిర్ధారించాలి. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రజలు ప్రశ్నిస్తే ఎగతాళి చేయడం కాదు.. అధికారుల తనిఖీలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంది.

నిబంధనలు అందరికీ సమానంగా వర్తించినప్పుడే ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.

చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి మాత్రం ఇష్టారాజ్యమా?

ఐనవోలులో రాజరాజేశ్వరి వైన్స్ నిర్వహణపై వస్తున్న ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? రాత్రి 10 గంటల తర్వాత జరిగినట్లు కనిపిస్తున్న ఈ లావాదేవీపై విచారణ జరిపిస్తారా? లేక ప్రశ్నించే ప్రజలే సమాధానం వెతుక్కోవాలా? ప్రజలకు కావాల్సింది ఎగతాళి కాదు.. నిబంధనల అమలు. అధికారుల నుంచి కావాల్సింది మాటలు కాదు.. క్షేత్రస్థాయి చర్యలు!



రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

మొదటి పేజీ తరువాయి...

కల్వల సంపత్,వార్డు సభ్యులు కల్వల శ్రీలత రామరాజు,రాజేశం గౌడ్,మిట్టపల్లి మహేశ్వరి రాజేశంతో పాటు పలువురు ముఖ్య నాయకులు,కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పెద్దపల్లి మండలంలోని బొంపల్లి,మెరపల్లి, కాసులపల్లి,పాలితం, గోపయ్యపల్లి,కాపులపల్లి,కనగర్తి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటి, ఎండల తీవ్రత పెరిగి సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతన్నలు కేవలం వరిపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఎల్నినో అనేది ఒక ప్రకృతి విపత్తు అని, దాన్ని ఆసరాగా చేసుకొని ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులు,ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్,డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దావోస్ తరహాలో ప్రపంచ విధాన చర్చలకు హైదరాబాద్ వేదిక

మొదటి పేజీ తరువాయి...

1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఇప్పటికే తమ అంగీకారం తెలిపారని వెల్లడించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంలో, జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు.

ప్రపంచానికి గాంధీ, నెహ్రూ విధానాలు అవసరం

మహాత్మా గాంధీ బోధించిన అహింసా సిద్ధాంతం, తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన అలీన విదేశాంగ విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలు భారతదేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా నేటి పరిస్థితుల్లో ఎంతో అవసరమనిహా పేర్కొన్నారు. కొన్ని అగ్రరాజ్యాలకు అనుగుణంగా వ్యవహరించే క్రమంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్వతంత్ర గుర్తింపును, అస్తిత్వాన్ని కోల్పోకూడదన్నదే నెహ్రూ ఆలోచన అని చెప్పారు. భారతదేశం స్వశక్తితో ఎదగడమే కాకుండా ప్రపంచంలోని ప్రగతిశీల, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నాయకత్వం వహించాలన్న ఆయన దూరదృష్టి దేశానికి బలమైన పునాదులు వేసిందన్నారు. పంచవర్ష ప్రణాళికలు, ఇతర ఆర్థిక విధానాలు దేశాన్ని బలోపేతం చేశాయని, నేడు ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు గుర్తింపు రావడంలో నెహ్రూ విధానాల పాత్ర కీలకమని వివరించారు.

ప్రతిపక్షం ప్రజాస్వామ్యానికి మరో కీలక స్తంభం

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఉన్నట్లే ప్రతిపక్షం కూడా ఉండాలని, ఈ రెండూ ప్రజాస్వామ్య వ్యవస్థకు రెండు కీలక స్తంభాలనిహా స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష పార్టీలను, నాయకులను శత్రువులుగా చూడకూడదని, కేవలం తమతో విభేదించే రాజకీయ ప్రత్యర్థులుగానే భావించాలని సూచించారు.

ప్రతిపక్షాల ఆలోచనలు, విధానాలను వ్యతిరేకించవచ్చే తప్ప, వారిని శత్రువులుగా పరిగణించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రతిపక్ష పార్టీలను శత్రువులుగా చూస్తున్నారని, వాటిని, వాటి నాయకత్వాన్ని రాజకీయంగా అంతం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాలు రెండూ సమర్థవంతంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను బలంగా విశ్వసిస్తుందని, ఈ అంశాలపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలను, నాయకులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలి

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం అత్యంత ప్రాథమికమైన రాజ్యాంగ హక్కు అనిహా పేర్కొన్నారు. ఓటు హక్కు ద్వారానే ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం పొందుతారని చెప్పారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. రాహుల్ గాంధీ నుంచి క్షేత్రస్థాయిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల వరకు ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఓటు హక్కుల కోసమే తాము పోరాడటం లేదని, దేశంలో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ప్రతి పౌరుడి తరఫున మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు.

ఎక్కువ మంది ఓటర్లను తొలగించడం కాకుండా, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల కమిషన్, ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కావాలని అన్నారు.

ఈ మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌ఛార్జి గురుదీప్ సింగ్ సప్పల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సమృద్ధ భారత్ ఫౌండేషన్ డైరెక్టర్ పుష్పరాజ్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ కాదు..యాంటీ భారత్ సమ్మిట్!

మొదటి పేజీ తరువాయి...

100 దేశాల నుంచి వచ్చే ప్రతినిధుల ముందు రాహుల్ గాంధీ ఆలోచనా విధానాన్ని ఉంచి, ఆయనను కాబోయే ప్రధానిగా, ప్రధానమంత్రి మెటీరియల్‌గా షోకేస్ చేయడానికే ఈ వేదికను వాడుకుంటున్నారని కాంగ్రెస్ నేతలే బహిరంగంగా చెబుతున్నారన్నారు. భారతదేశంలో 140 కోట్ల ప్రజల చేతిలో పదేపదే తిరస్కారానికి గురై విఫలమైన రాహుల్ గాంధీని.. 100 దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రతినిధులను అడ్డుపెట్టుకొని లాంచ్ చేయాలని చూడటం హాస్యాస్పదమన్నారు.

ప్రమాదకర శక్తులు..

ఈ 'ప్రోగ్రెసివ్ అలయెన్స్' వెనుక ఉన్నది అంతర్జాతీయంగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూలదోసే ప్రమా దకర శక్తులని ఆయన ఆరోపించారు. ఫాక్స్ న్యూస్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం ద్వారా అస్రా నొమాని వెలికితీసిన నిజాలను ప్రస్తావిస్తూ.. 9 దేశాల్లో విద్యార్థులను పావులుగా వాడుకుంటూ ఇస్లామిక్, కమ్యూనిస్ట్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్‌ను నడుపుతున్న 101 సంస్థలు ఈ కూటమి వెనుక ఉన్నాయని తెలిపారు. ఇంతటి ప్రమాదకర వ్యవస్థలో రాహుల్ గాంధీ ప్రెసిడియం ఈక్వలెంట్ సభ్యుడి గా ఉన్నారని, మొన్నటికి మొన్న ఫ్రాన్స్, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడానికి 'రెజీమ్ చేంజ్' పేరిట జరిగిన హింసాత్మక అల్లర్ల వెనుక వీరి పాత్ర ఉందని తేలిందన్నారు. జార్జ్ సోరోస్ లాంటి భారత వ్యతిరేక శక్తుల నిధులతో నడిచే ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ డెలిగేషన్‌తో సోనియా గాంధీ 10 జనపథ్‌లో, మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ కార్యాలయంలో సమావేశమయ్యారని గుర్తు చేశారు. ఈ కూటమిలో ప్రజాస్వామ్యం లేని 42 ఇస్లామిక్ దేశాలు, లెఫ్టిస్ట్ దేశాలు, నియంతృత్వ రాచరిక వ్యవస్థల ప్రతినిధులే ఉన్నారని, అలాంటి శక్తులకు హైదరాబాద్‌ను అడ్డాగా మార్చి దేశంలో అలజడి సృష్టించా లని చూస్తున్నారని హెచ్చరించారు.

విదేశీ శక్తుల అండతో 2029 సార్వత్రిక ఎన్నికల వరకు దేశంలో నిరంతరం అరాచకాలు, హింసను సృష్టించి ప్రభుత్వ మార్పు తేవాలన్నదే కాంగ్రెస్ దుష్ట పన్నాగమని ఆరోపించారు. గతంలో కూడా ఇదే ప్రోగ్రెసివ్ అలయెన్స్, తెలంగాణ ప్రభుత్వం కలిసి నిర్వహించిన సమ్మిట్ కోసం సుమారు రూ. 29 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టారని, ఇప్పుడు మళ్లీ అదే రీతిలో నిధులు వాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుశా ఇక్కడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఈ అంతర్జాతీయ కుట్రల గురించి తెలియకపోవచ్చన్నారు.

ఆరు గ్యారెంటీల అమలేది..?

అసెంబ్లీ ఎన్నికల ముందు ఊరూరా తిరిగి ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, వర్గాల వారీ డిక్లరేషన్లను అమలు చేశాకే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు తెలంగాణలో అడుగుపెట్టాలని, వారు వస్తే బీజేపీ కార్యకర్తలు అడుగడుగునా నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకుంటారని తేల్చిచెప్పారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా రైతులకు రైతుభరోసా ఇవ్వలేదని, ఎల్ నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారమూ చెల్లించలేదని విమర్శించారు.

గత 34 నెలలుగా ప్రభుత్వ భూముల అమ్మకాలు, మార్ట్‌గేజ్‌ల ద్వారా సుమారు రూ. 30 వేల కోట్లు సమకూ ర్చుకున్న ఈ ప్రభుత్వం.. ఆ నిధులను వేటి కోసం ఖర్చు చేసిందో ప్రజలకు శ్వేతపత్రం ద్వారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు మళ్లీ మియాపూర్‌లోని 5 వేల ఎకరాల హెచ్ఎండీఏ, టీజీఐఐసీ విలువైన భూములను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు తెగనమ్మేందుకు, తాకట్టు పెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

17న రాష్ట్రానికి గడ్కరీ..

ఈనెల 17న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణలో నూతన జాతీయ రహదారుల ప్రారంభోత్సవానికి వస్తున్నారని తెలిపారు. రేషన్ బియ్యం మొదలుకొని ధాన్యం సేకరణ, ఎంఎస్పీ పెంపు, ఫసల్ బీమా వంటి ప్రతి సంక్షేమ పథకానికి కేంద్రమే వెన్నెముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ వైఫల్యాలను, దేశద్రోహ శక్తులతో ఆ పార్టీ కుమ్మక్కైన తీరును బీజేపీ క్షేత్రస్థాయిలో ఎండగడుతుందని, ఈ సమ్మిట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు రవి నాయక్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సోలంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి

మొదటి పేజీ తరువాయి...

లక్ష్యంగా అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

రీసర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని అలాగే కలెక్టర్లు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూమి విస్తీర్ణం ఎంత? రీసర్వే అనంతరం గుర్తించిన విస్తీర్ణం ఎంత? అనే వివరాలను భూ యజమానులకు తక్షణమే తెలియజేయాలని ఆదేశించారు. భూ యజమానులకు ఎలాంటి సందేహాలు, అపోహలు లేకుండా సర్వే ప్రక్రియపై పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు.

141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే

పాలేరు నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని, నియోజకవర్గ పరిధిలోని మొత్తం 141 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు, రెండు రోవర్లను సమకూర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం 708 రోవర్లతో సర్వే కొనసాగుతోందని, మరో వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే శాఖ అధికారులతో రీసర్వే, హౌసింగ్ అంశాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

క్షేత్రస్థాయి అధికారుల సూచనలతో ఎస్ఓపీలో మార్పులు

రీసర్వే నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) జారీ చేసిందని మంత్రి తెలిపారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఎస్ఓపీని సక్రమంగా అమలు చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భిన్నమైన పద్ధతులు అనుసరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.క్షేత్రస్థాయి అధికారుల అనుభవాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని ఎస్ఓపీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపేలా మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు.

రీసర్వే సమస్యలపై తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సుదీర్ఘ సమీక్షలు

రీసర్వే అమలు తీరుపై ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులతో పాటు జిల్లాల వారీగా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మండల స్థాయి రెవెన్యూ, సర్వే అధికారులతో సుదీర్ఘంగా సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి అధికారులతో స్వయంగా సమావేశమై, ఒక్కో సమావేశంలో ఐదు నుంచి ఆరు గంటల పాటు రీసర్వేలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు. ఇటీవల సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన క్షేత్రస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాలు, నోటీసులు జారీ చేసిన గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించినట్లు తెలిపారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు, ఇతర భూ వివాదాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ–ఫారెస్ట్ భూ సరిహద్దుల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి

రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఇరు శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిహద్దులను నిర్ధారించాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

సర్వేలో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అభినందనలు..

నిజామాబాద్‌పై అసంతృప్తి... రీసర్వే నిర్వహణలో మంచి ప్రతిభ కనబరుస్తున్న నల్గొండ, ఖమ్మం జిల్లా కలెక్టర్లను మంత్రి అభినందించారు. అదే సమయంలో నిజామాబాద్ జిల్లాలో రీసర్వే జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరును మెరుగుపరుచుకొని నిర్దేశిత లక్ష్యాల మేరకు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అర్హులైన పేదలకు త్వరితగతిన లబ్ధి చేకూర్చాలని మంత్రి ఆదేశించారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను తక్షణమే గుర్తించి, సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. రెండు పడక గదుల (2బీహెచ్‌కే) ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నప్పటికీ, ఆయా ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లను తక్షణమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

హసన్‌పర్తి మీడియా పాయింట్ పేరుతో మరో కమిటీ ప్రకటనలు!

- ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించేది లేదు.
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమిటీయే అధికారికం - అధ్యక్షుడు ఎలుకరాజు సదానందం



నవంబర్ 11 ప్రజాకలం ప్రతినిధి: (హన్మకొండ /హసన్ పర్తి)

హసన్‌పర్తి మీడియా పాయింట్ పేరుతో కొందరు వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం మరో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మీడియా పాయింట్ అధ్యక్షుడు ఎలుకరాజు సదానందం ఆరోపించారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమిటీ ఉండగా, మరో కమిటీ పేరుతో ప్రచారం చేయడం సరికాదని స్పష్టం చేశారు.బుధవారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని మీడియా పాయింట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం మండలానికి చెందిన 25 మంది విలేకరులతో ప్రత్యక్ష ఓటింగ్ నిర్వహించి కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన తాను ప్రత్యర్థి దండుగూడం రాజకుమార్‌పై ఒక్క ఓటు మెజారిటీతో విజయం సాధించగా, ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన గరిగె శ్రీనివాస్.. గడ్డం సంపత్‌పై 19 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు వివరించారు.కోశాధికారిగా దాడి చిరంజీవి, సహాయ కార్యదర్శిగా గోలె రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా దాడి భిక్షపతి, పోగుల రాజుకుమార్ ఓటింగ్ ద్వారా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను సైతం ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల ఫలితాలను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఈసీ సభ్యుడు, ఎన్నికల అధికారి కందుకూరి సంజీవ్ అధికారికంగా ప్రకటించినట్లు గుర్తుచేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమిటీ కొనసాగుతుండగా, కొందరు మరో సమూహంగా ఏర్పడి హసన్‌పర్తి మీడియా పాయింట్ పేరుతో పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడాన్ని అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరిని ప్రలోభాలకు గురిచేస్తూ తప్పుడు ప్రచారాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి ప్రకటనలను ప్రజలు నమ్మవద్దని, కమిటీల పేరుతో మోసాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులపై ప్రజల్లో అపనమ్మకం కలిగించేలా వ్యవహరిస్తే భవిష్యత్తులో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశంలో విద్యాభివృద్ధికి పునాదులు వేసిన..

మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలకు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ

జగిత్యాల ప్రతినిధి నవంబర్ 11 (ప్రజా కలం) : స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసి, గుణాత్మక విద్యకు పునాదులు వేసిన తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ పేర్కొన్నారు. బుధవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు



వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ జన్మదినమైన నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆజాద్ సుమారు 11 సంవత్సరాల పాటు దేశ విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారు. సమగ్ర విద్యావిధాన రూపకల్పనకు పునాదులు వేయడంతో పాటు ప్రాథమిక, ఉన్నత, సెకండరీ విద్యాభివృద్ధికి ప్రత్యేక కమిషన్లను ఏర్పాటు చేశారు.విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాల సాధనకు యూజీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటుకు కృషి చేసి, సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు. భారతీయ సంస్కృతి, కళలు, సంగీతం, సాహిత్య పరిరక్షణకు విశేష సేవలందించారు. విద్య ద్వారానే వ్యక్తి, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని చాటిచెప్పిన ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయాలని ఈ సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, జిల్లా రెవెన్యూ అధికారి కె. వై వై ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన

పంట దిగుబడి అంచనాలు ఖచ్చితంగా ఉండేలా చర్యలు చేపట్టాలి

జగిత్యాల్ ప్రతినిధి నవంబర్ 11(ప్రజా కలం) జగిత్యాల జిల్లాలో క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలను రాష్ట్ర గణాంక శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి జి. సత్యం ఆధ్వర్యంలో హైదరాబాద్ రాష్ట్ర గణాంక శాఖ గణాంక అధికారి వి. శ్రీనివాస్, ఉప గణాంక అధికారి పులి రాజు జిల్లాలో పర్యటించారు. కోడిమ్యాల మండలం తిప్పాయిపల్లి, వెల్గటూర్



మండలం బెర్సాని, మెట్పల్లి మండలం విత్తంపేట గ్రామాల్లో వరి దిగుబడి అంచనా కోసం నిర్వహించిన పంట కోత ప్రయోగాల ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రయోగాలను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల ప్రణాళిక, గణాంక అధికారులకు సూచించారు.పంట కోత ప్రయోగాల ద్వారా సేకరించే దిగుబడి వివరాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ వివరాల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట దిగుబడులను అంచనా వేసి వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రణాళికలు, విధానాలు, కార్యక్రమాలను రూపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో ప్రణాళిక శాఖ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు.పంట కోత ప్రయోగాల నిర్వహణ, డేటా నమోదు, ఫలితాల ఖచ్చితత్వం, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి వేణుగోపాల్, ఉప గణాంక అధికారులు టి. నరేశ్, డి. రాజేశ్, కె. మధు, గజేంద్ర ప్రసాద్, ఎంఎస్పీవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

సత్తక్కపల్లి, చెర్లకొండాపూర్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ

రూ.17 లక్షల నిధులతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సంజయ్

మెట్ పల్లి రూరల్ నవంబర్ 11: (ప్రజా కలం);గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు



కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. మెట్పల్లి మండలంలోని సత్తక్కపల్లి, చెర్లకొండాపూర్ గ్రామాల్లో మొత్తం రూ. 17 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు.సత్తక్కపల్లి గ్రామంలో రూ. 12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, చెర్లకొండాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రూ. 5 లక్షలతో నిర్మించనున్న కిచెన్ షెడ్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.నిర్మాణ పనులు పూర్తయితే అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కూడా సౌకర్యవంతమైన వాతావరణం కలగనుంది. గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో మౌలానా ఆజాద్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ముస్లిం సమాజం పట్ల వివక్ష చూపడం తగదు : ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. రఫీ



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, నవంబర్ 11(ప్రజా కలం) స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జ్ఞాపక విగ్రహాన్ని కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేయకపోవడం ముస్లిం సమాజం పట్ల వివక్ష చూపడమేనని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. రఫీ అన్నారు. వచ్చే ఏడాది మౌలానా ఆజాద్ జయంతి నాటికి ముందే పట్టణంలో ఆయన జ్ఞాపక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కోరుట్లలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రఫీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా కోరుట్ల పట్టణంలో మౌలానా ఆజాద్ జ్ఞాపక విగ్రహం లేకపోవడం విచారకరమన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ కులాలు, మతాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేశారని, అయితే ముస్లిం సమాజానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు ముస్లిం సమాజానికి చెందిన అనేక మంది కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మౌలానా ఆజాద్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. దేశ విభజన సమయంలో ముస్లింలు భారత్‌ను విడిచి వెళ్లకుండా దేశంలోనే ఉండాలని ఆయన ఇచ్చిన సందేశాన్ని రఫీ గుర్తుచేశారు. మౌలానా ఆజాద్ సేవలు, త్యాగాలను నేటి తరానికి గుర్తుచేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఏడాది ఆయన జయంతి కంటే ముందే కోరుట్ల పట్టణంలో జ్ఞాపక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లేదంటే ఎంఐఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ కార్యదర్శి అబ్దుల్ వాజిద్, మాజీ కౌన్సిలర్ చిట్యాల భూమయ్య, సహాయ కార్యదర్శులు మహమ్మద్ నిజాం, అబ్దుల్ రహీం, కోశాధికారి మహమ్మద్ ముజాహిద్ ఖాన్, యూత్ ఐకాన్ హఫీజ్ ఖురేషి, మహమ్మద్ సల్మాన్, షేక్ హాజీ, ఎండీ సమీర్, షేక్ మున్నా, మహమ్మద్ ఇసాక్, ఎండీ లైఖ్, మహమ్మద్ అఫీఫ్, ఎండీ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

గడి బురుజు మన చారిత్రక వారసత్వ సంపద

భూకబ్జా ప్రయత్నాలను అడ్డుకుంటాం..

వీఎల్‌టీ రద్దు చేయాలి: ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

అఖిలపక్ష ప్రజా సంఘాలతో కలిసి పరిరక్షణకు ఐక్య పిలుపు



మెట్ పల్లి :(కోరుట్ల) ప్రతినిధి, నవంబర్ 11 (ప్రజాకలం): కోరుట్ల పట్టణ చారిత్రక గుర్తింపుకు ప్రతీకగా నిలిచిన గడి బురుజును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గడి బురుజు స్థలాన్ని భూకబ్జాదారుల ప్రయత్నాల నుంచి రక్షించేందుకు రాజకీయాలకు అతీతంగా అఖిలపక్షాలు, ప్రజా సంఘాలు, పట్టణ ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో గడి బురుజు పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడి బురుజు సాధారణ ఖాళీ స్థలం కాదని, కోరుట్ల పట్టణ చరిత్ర, సంస్కృతితో ముడిపడిన విలువైన వారసత్వ సంపద అని అన్నారు. ఈ స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించేందుకు, విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.గడి బురుజు స్థల పరిరక్షణ కోసం ఇప్పటికే కలెక్టర్‌తో పాటు సంబంధిత మంత్రిని కలిసి సమస్యను వివరించామని తెలిపారు. అన్ని పార్టీల కౌన్సిలర్ల సంతకాలతో అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారని గుర్తుచేశారు. గడి బురుజు స్థలంపై విధించిన వీఎల్‌టీ ని రద్దు చేయాలని అన్ని పార్టీల కౌన్సిలర్లు, ప్రజా సంఘాలు కోరుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అక్రమంగా విధించిన వీఎల్‌టీని వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్నామని తెలిపారు. ప్రజల విజ్ఞప్తులను పట్టించుకోకుండా సమస్యను పరిష్కరించకపోతే పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని హెచ్చరిం చారు. అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గడి బురుజు కేవలం భూమి కాదని, కోరుట్ల పట్టణ చరిత్రకు గుర్తుగా నిలిచిన ప్రజాఆస్తి అని అన్నారు.దశాబ్దాలుగా ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ స్థలాన్ని కాపాడేందుకు గతంలోనూ అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. గడి బురుజు స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా పార్కు, కూరగాయల మార్కెట్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలకు తావులేకుండా చారిత్రక స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, పట్టణ అఖిలపక్ష ప్రజా సంఘాల అధ్యక్షుడు ఎం.డి. ముజాహిద్, గౌరవ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా భూమేశ్వర్, సీపీఐ నేత సుతారి రాములు, ఎన్‌హెచ్ఎఫ్ అధ్యక్షుడు షాహేద్ మహ్మద్ షేక్, పలువురు కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : మంత్రి అడ్లూరి

- కాంగ్రెస్ పార్టీలో చేరిన దమ్మన్నపేట,ఆత్మకూరు సర్పంచులు



గొల్లపల్లి నవంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలో బుధవారం మంత్రి అడ్లూరి పర్యటించారు.మండలంలోని రంగదామునిపల్లి గ్రామంలో నర్మెట్ల మౌనిక మహేష్ లకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించారు.అదే గ్రామానికి చెందిన ఎద్దు శంకరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని మంత్రి పరామర్శించారు.అనంతరం దమ్మన్నపేట సర్పంచ్ ముదాం గౌతమి జానారెడ్డి, ఆత్మకూరు గ్రామ సర్పంచ్ దమ్మన్నపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి మంత్రి లక్ష్మణ్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏనాడు ప్రజా సమస్యలు పట్టించుకోలేదని 2014 నుండి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మేమే రాజులం మేమే మంత్రులం అన్న చందంగా వ్యవహరించారని అన్నారు. బీఆర్ఎస్ పాలను గమనించిన ప్రజలు మార్పు కోరి ప్రజా ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని మంత్రి తెలిపారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందించడంతో పాటు రేషన్ కార్డుల పై సన్న బియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి తీరుతామని అన్నారు. రెండు గ్రామాల సర్పంచులు అభివృద్ధిని ఆకాంక్షించి కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని ఆహ్వానిస్తున్నామని మంత్రి తెలిపారు. రెండు గ్రామాల అభివృద్ధికి వంద శాతం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాలు అమలుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని మంత్రి తెలిపారు. అనంతరం గొల్లపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని, దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో ఏ ఏం సి చైర్మన్ బీమా సంతోష్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, ముస్కు నిశాంత్ రెడ్డి, రంగదామునిపల్లి సర్పంచ్ అనిల్ , సర్పంచులు దాసరి తిరుపతి, కాసారపు అరవింద్ గౌడ్, బుచ్చిరెడ్డి, శ్రీధర్, గౌతమ్ ,పార్టీ సీనియర్ ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి విద్యార్థికి జేఎన్‌టీయూలో స్వర్ణ పతకం

బీఫార్మసీలో అత్యుత్తమ ప్రతిభ.. యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం

ఫార్మ్-డీలో ఉచిత ప్రవేశం.. ఇమ్రాన్ విజయంపై పట్టణంలో హర్షం





మెట్‌పల్లి టౌన్ ప్రతినిధినవంబర్ 11, (ప్రజాకలం): పట్టుదల, కృషి, అంకితభావంతో విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ నిరూపించాడు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బీఫార్మసీ) పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో స్వర్ణ పతకాన్ని సాధించాడు.బీఫార్మసీ విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రథమ స్థానాన్నిక్కైవసం చేసుకోవడం విశేషం. సాధారణ పట్టణ నేపథ్యం నుంచి వచ్చిన ఇమ్రాన్ తన ప్రతిభతో యూనివర్సిటీ స్థాయిలో గుర్తింపు పొందడం మెట్‌పల్లి పట్టణానికి గర్వకారణంగా నిలిచింది.

ఉన్నత విద్యకు మరో ముందడుగు.. బీఫార్మసీలో సాధించిన అద్భుత ఫలితాల నేపథ్యంలో ఇమ్రాన్‌కు ఫార్మ్-డీ (డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సులో ఉచిత సీటు లభించింది. ఫార్మసీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఉన్నత విద్యను కొనసాగించనున్నాడు.

అభినందనల వెల్లువ... ఇమ్రాన్ సాధించిన స్వర్ణ పతకంపై మెట్‌పల్లి పట్టణానికి చెందిన విద్యావంతులు, మేధావులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగంలో ప్రతిభ కనబరిచి పట్టణానికి మంచి పేరు తీసుకువచ్చిన ఇమ్రాన్‌ను అభినందించారు. భవిష్యత్తులో ఫార్మసీ రంగంలో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఇమ్రాన్ సాధించిన ఈ ఘనత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పట్టణ ప్రజలు పేర్కొన్నారు.


సంధిరి బాలయ్య 115వ జయంతి సందర్భంగా ఘన నివాళి

గంగపుత్ర యువతకు ప్రభుత్వ ఆర్థిక సహకారం అందించాలి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 11(ప్రజా కలం): గంగపుత్ర జాతి ముద్దుబిడ్డ, జాతిపిత క్రీస్తుశేషులు సంధిరి బాలయ్య 115వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మెట్‌పల్లిలోని గంగాపుత్ర బెస్త సంఘం భవనంలో ఆయన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు పర్రె శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్రె శంకర్ మాట్లాడుతూ.. గంగపుత్రుల అభ్యున్నతికి సంధిరి బాలయ్య చేసిన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గంగపుత్రులు చెరువులు, కుంటలను నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గంగపుత్ర యువత ఉపాధి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్థిక సహకారం అందించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పారిపెల్లి కిషన్, ఆర్మూర్ నరేందర్, కుడుముల సాయన్న, గంగారం ఆర్మూర్ రంజిత్, పరిమి నరసయ్య, ఆర్మూర్ నరేశ్, మాన్కాల పోచయ్య, పర్రె సంతోశ్, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

మండల వార్డ్ మెంబర్ల ఫోరం అధ్యక్షులు గా బొమ్మగాని సతీష్ గౌడ్



ధర్మారం, నవంబర్ 11 : (ప్రజా కలం ప్రతినిధి) మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు గా బొమ్మగాని సతీష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షురాలు నాగవేల్లి జ్యోతి--మహేష్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ఇంచార్జి తప్పట్ల మోహన్ నియోజకవర్గ ఇంచార్జి తీగల అశోక్ గౌడ్ ఆధ్వర్యం లో బుధవారం రోజున ధర్మారం మండల కేంద్రం లోనీ గౌతమబుద్ధ ఫంక్షన్ హాల్ లో మండల వార్డు సభ్యుల ఫోరం సమావేశాన్ని నిర్వహించి పూర్తిస్థాయి మండల కమిటీని ఏర్పాటు చేశారు. ధర్మారం గ్రామ పంచాయతీ కి చెందిన 6వ వార్డు సభ్యులు బొమ్మగాని సతీష్ గౌడ్ మండల అధ్యక్షులుగా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొమ్మ మహేందర్, ప్రధాన కార్యదర్శి గా రేషవేణి మహేష్, ఉపాధ్యక్షులుగా రెడపాక లక్ష్మణ్, మేకల కోమల్, చల్ల గంగారెడ్డి, కోమటిరెడ్డి తిరుపతి రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఇస్లావత్ రాజేందర్ నాయక్, కాదాసి ప్రసాద్, కోరే మహేష్,గుంటి సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నెవనందులా వెంకటేష్ ఎన్నిక అయ్యారు. మహిళా వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షురాలిగా ఇందూరి శిరీష నియామకం అయ్యారు. ప్రధాన కార్యదర్శి గా సిరికొండ మమత, ఉపాధ్యక్షురాలిగా రెండ్ల అనిత, ముద్ద పుష్ప, అరుగుల వెంకటేశ్వరి, జాయింట్ సెక్రటరీలుగా సాద మౌనిక, అర్దవెల్లి రజిత, సెక్రటరీలుగా గూడెపు స్వరూప, బోట్ల విజయ నియామకం అయ్యారు. మండల అధ్యక్షునిగా నియామకం అవ్వడం పట్ల కమిటీ ప్రతినిధులకు, వార్డు సభ్యులకు బొమ్మగాని సతీష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు.

ప్రజా కలం
గురువారం, నవంబర్ 12, 2026

కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో సమన్వయం అవసరం

దేశ సమగ్రతకు బలమైన కేంద్రం ఎంత అవసరమో, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగల సమర్థవంతమైన రాష్ట్రాలు కూడా అంతే అవసరం. కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం పోటీపడే వ్యవస్థలు కావు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యం అనే ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు రాజ్యాంగం ఏర్పాటు చేసిన పరస్పర సహకార వ్యవస్థలు. ఈ సంబంధాల్లో సమన్వయం లోపిస్తే ప్రభావితమయ్యేది ప్రభుత్వాలు మాత్రమే కాదు, ప్రజల ప్రయోజనాలు కూడా. అందుకే అధికారాల పంపిణీతోపాటు పరస్పర విశ్వాసం, సంప్రదింపులు, రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. కేంద్ర రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం 2025 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2026 ఫిబ్రవరిలో తొలి నివేదిక సమర్పించింది. గవర్నర్ల అధికారాలు, రాష్ట్రాల స్వయంప్రతిపత్తి, విద్య, ఆరోగ్యం, ఆర్థిక వనరుల పంపిణీ, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలను పరిశీలించింది. అయితే కమిటీ విధులు రాష్ట్ర న్యాయ కమిషన్ బాధ్యతలతో సమానంగా ఉన్నాయనే కారణంతో నవంబర్ 6న దానిని రద్దుచేసి, సంబంధిత పనులను న్యాయ కమిషన్‌కు అప్పగించారు. ఈ పరిణామం సమాఖ్య వ్యవస్థలో సంస్థాగత అధ్యయనాల కొనసాగింపు ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేసింది. భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాల ద్వారా శాసనాధికారాలు విభజించబడ్డాయి. 263వ అధికరణ అంతర్రాష్ట్ర మండలి ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. 280వ అధికరణ ఆర్థిక సంఘానికి రాజ్యాంగ ప్రాతిపదికను అందిస్తుంది. ఈ ఏర్పాట్ల ప్రధాన ఉద్దేశం అధికారాల మధ్య సమతుల్యతను కాపాడుతూ జాతీయాభివృద్ధిని వేగవంతం చేయడమే. గవర్నర్ల పాత్ర కూడా ఈ వ్యవస్థలో అత్యంత కీలకం. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. నిర్ణయాల్లో అనవసర జాప్యం పరిపాలనపై ప్రభావం చూపవచ్చు. అందువల్ల రాజ్యాంగ పరిమితులపై స్పష్టత, సంస్థల మధ్య నిరంతర సంప్రదింపులు అవసరం. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై గతంలో సర్కారియా కమిషన్ 1988లో, పూంఛీ కమిషన్ 2010లో నివేదికలు సమర్పించాయి. ఈ అధ్యయనాల్లోని ఆచరణయోగ్యమైన సిఫార్సులను సమీక్షించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అమలు చేయడం ప్రయోజనకరం. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, విపత్తుల నిర్వహణ వంటి రంగాల్లో సమన్వయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. కమిటీలను ఏర్పాటు చేయడం ఎంత ముఖ్యమో, వాటి అధ్యయన ఫలితాలను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యం. పరిపాలనా అవసరాల దృష్ట్యా సంస్థాగత మార్పులు చేసినప్పటికీ, ఇప్పటికే జరిగిన పరిశోధన, సేకరించిన సమాచారం, రూపొందించిన సిఫార్సులు వృథా కాకుండా చూడాలి. విధాన నిర్ణయాల్లో నిపుణుల అభిప్రాయాలకు, పారదర్శకతకు సముచిత స్థానం కల్పించాలి. బలమైన కేంద్రం, సమర్థవంతమైన రాష్ట్రాలు పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావు. రెండూ కలిసినప్పుడే దేశాభివృద్ధికి స్థిరమైన పునాది ఏర్పడుతుంది. అధికారాల కంటే బాధ్యతలకు, విభేదాల కంటే సంప్రదింపులకు, సంస్థాగత ఆధిపత్యం కంటే సహకారానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే భారత సమాఖ్య వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుంది. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసమే జాతీయ ఐక్యతకు నిజమైన బలం.

ఎల్ నినో పరిస్థితులలో వ్యాపారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి నవంబర్ 11 :
ఎల్ నినో పరిస్థితులలో బియ్యం వ్యాపారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ సదానందం లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. బియ్యం బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, బి.పి.టి. స్టీమ్ బియ్యం 1 వేయి 482 రూపాయలు, బి.పి.టి. పాత బియ్యం 1 వేయి 638 రూపాయలు, హెచ్.ఎం.టి. పాత బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జె.ఎస్.ఆర్. పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్ లలో శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ రైస్ డిపో, దేవుడా రైస్ డిపో వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బియ్యం విక్రయ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. కొత్త బియ్యం బ్యాగ్ ను 1 వేయి 430 రూపాయలు, బి.పి.టి. స్టీమ్ బియ్యం 1 వేయి 612 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ బియ్యం 1 వేయి 898 రూపాయలు, హెచ్.ఎం.టి. పాత బియ్యం బస్తా 1 వేయి 976 రూపాయలు, జె.ఎస్.ఆర్. పాత బియ్యం 2 వేల 28 రూపాయల చొప్పున నిర్ణీత గరిష్ట ధరలకు విక్రయించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులను నిర్ణీత ప్రమాణాలతో, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులలో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం అందించాలని, భోజనం నాణ్యత, వంటశాల పరిసరాలు, పరిశుభ్రత తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి జి.ఓ. నంబర్ 76, 58, 59 క్రింద వచ్చిన దరఖాస్తులు, భూ భారతి కార్యక్రమం, భూముల రీ-సర్వే, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. జి.ఓ. నం. 58, 59 లకు సంబంధించిన దరఖాస్తుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, భూ రికార్డుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు మంజూరు చేసేందుకు అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అంగన్‌వాడీ నిర్వహణ అస్తవ్యస్తం

- కేంద్రంలో ముగ్గురు..రికార్డుల్లో 10 మంది



మల్లాపూర్ నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి)

చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణకు వేదిక కావాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి. మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహణ తీరు అందోళన కలిగిస్తోంది. కేంద్రానికి ముగ్గురు చిన్నారులు మాత్రమే హాజరైనప్పటికి రికార్డుల్లో మాత్రం పది మంది హాజరైనట్లు నమోదు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని కేంద్రంలోనే వినియోగించకుండా టీచర్ ఇంటికి తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు భవనానికి కిటికీలు కూడా లేకపోవడం గమనార్హం. టీచర్ విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? చిన్నారుల హాజరు, ఆహార పంపిణీని అధికారులు పరిశీలిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన సూపర్‌వైజర్ల తనిఖీలు క్షేత్రస్థాయిలో కాకుండా ఫోటోలకే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేంద్రం నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా, నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సృజనాత్మకతను వెలికితీయడానికే యువజనోత్సవ వేడుకలు

- జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్



జగిత్యాల ప్రతినిధి నవంబర్11(ప్రజాకలం) :యువజనోత్సవాల ద్వారా యువతలోని సృజనాత్మకత, కళలు, క్రీడలు, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి నిర్వహించే సాంస్కృతిక వేడుక అని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ పేర్కొన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి యువనోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ కళా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మొత్తం 167 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. జానపద నృత్యంలో 9 బృందాలు, జానపద గేయాల్లో 5 బృందాలు, పెయింటింగ్‌లో 12 మంది, కవితా రచనలో 15 మంది పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ సత్య ప్రణవ్ యువతలో సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీయడమే యువజనోత్సవాల ప్రధాన ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఎస్‌కేఎన్‌ఆర్ బాయ్స్ కళాశాల ప్రిన్సిపల్, గర్ల్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, యువజన సంఘాల నాయకులు రాజేశ్, విక్రమ్ రెడ్డి, నేషనల్ యూత్ అవార్డు గ్రహీత కొండ రవి పాల్గొన్నారు. కాగా ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా,సతీశ్, పరశురామ్ గౌడ్, శ్యాంసుందర్ వ్యవహరించారు.

విద్యా ప్రదాత మౌలానా అబుల్ కలాం ఆజాద్

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి,నవంబర్ 11:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

భారత విద్యా రంగానికి బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ 1888 నవంబర్ 11న సౌదీ అరేబియాలోని మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ అని,అబుల్ కలాం అనేది ఆయన బిరుదు కాగా ఆజాద్ అనేది ఆయన కలం పేరు అని తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధుడైన ఆయన ప్రఖ్యాత పండితుడు,కవి,అరబిక్, ఇంగ్లీష్,ఉర్దూ,హిందీ, పెర్షియన్, బెంగాలీ వంటి అనేక భాషలలో ప్రావీణ్యుడని పేర్కొన్నారు. స్వతంత్ర భారత ప్రభుత్వంలో తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు పనిచేసిన ఆయన నిరుపమాన సేవలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం 2008లో ఆయన జన్మదినమైన నవంబర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఐఐటీ, యుజిసి, సాహిత్య అకాడమీ,సంగీత నాటక అకాడమీ,లలిత కళా అకాడమీ వంటి అనేక ప్రముఖ విద్యా,సాంస్కృతిక సంస్థల స్థాపనలో ఆయన కీలక దిశా నిర్దేశం చేశారని అన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్య అందాలని, ముఖ్యంగా మహిళా అక్షరాస్యత సాంకేతిక విద్యను ప్రోత్సహించాలని ఆజాద్ బలంగా ఆకాంక్షించారని తెలిపారు.ప్రతి సంవత్సరం పాఠశాలలు,కళాశాలలు మరియు విద్యాసంస్థల్లో జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవం, సందర్భంగా సెమినార్లు,వ్యాస రచన పోటీలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆయన ఆశయాలను స్మరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి జి.రవికుమార్,కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

సి హెచ్ సి లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

-ప్రభుత్వ హాసుపత్రి లో ఓపీ సేవల బలోపేతం

ఆర్ఎంఓ డాక్టర్ శ్రావణ్ కుమార్



ధర్మారం, నవంబర్ 11 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని నంది మేడారం గ్రామం లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఓపీ సేవలను బలోపేతం చేయడం, ఓపీ రోగుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నామని డాక్టర్ వివరించారు. సి హెచ్ సి ఆర్ఎంఓ డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ హసు పత్రి పై నమ్మకం పెంపొందించేలా నాణ్య మైన వైద్య సేవలు, అందిస్తూ అవసరమైన వైద్య పరీక్షలు, సరైన చికిత్సలు, మెరుగైన రోగి సేవలు అందించేందు కు కృషి చేస్తున్నామని ప్రజలు అందరూ నంది మేడారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అందు బాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతు న్నామని పత్రికా మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ కార్యక్రమానికి సంబంధించిన సమా చారాన్ని పత్రికలు, మీడియా మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసి సహకరించాలని సి హెచ్ సి ఆర్ఎంవో డాక్టర్ శ్రావణ్ కుమార్ కోరారు.

గీత కార్మిక ఉద్యమ శిఖరం దేశిని చిన్న మల్లయ్య

- దేశిని చిన్న మల్లయ్య 9వ వర్ధంతి సంస్మరణ సభ



పెద్దపల్లి,నవంబర్ 11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కల్లుగీత కార్మికుల హక్కుల కోసం జీవితాంతం ఉద్యమించిన నిబద్ధత గల ప్రజా నాయకుడు,మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య అని వక్తలు కొనియాడారు.ఆయన 9వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నందన గార్డెన్‌లో మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్ ఆధ్వర్యంలో సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు,అభిమానులు చిన్న మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్ మాట్లాడుతూ ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చిన్న మల్లయ్య సర్పంచ్‌గా తన ప్రజా ప్రస్థానాన్ని ప్రారంభించి,ప్రజల ఆదరాభిమానాలతో నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై విశేష సేవలందించారని గుర్తుచేశారు.పదవులు, రాజకీయాలకు అతీతంగా బడుగు,బలహీన వర్గాల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ముఖ్యంగా కల్లుగీత కార్మికుల సంక్షేమానికి,వారి హక్కుల సాధనకు ఆయన చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని,ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావడమే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.భౌతికంగా ఆయన దూరమైనా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు చిన్న మల్లయ్యతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు రమణ,ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు నరసయ్య,సాంబయ్య,సర్వాయి పాపన్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సింగం సత్తయ్య గౌడ్,మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు జాగిరి అంజి గౌడ్,గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కోట రవి గౌడ్,వడాల కొమురయ్య,రైతు సంఘం నాయకులు మునిమడుగుల మల్లన్నతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ

మెట్ పల్లి రూరల్ నవంబర్ 11:(ప్రజా కలం);మెట్ పల్లి మండలం కొండ్రికర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం--1లో చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంట రాజేశ్వర్, ఉప సర్పంచ్ బద్దం రమేష్ చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.చిన్నారుల సంక్షేమం, విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి ఎదుగుదలకు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ గంగాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పార్డి బి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలు: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వితల్ రెడ్డి



నిర్మల్, నవంబర్ 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): కుబీర్ మండలం పార్డి బి గ్రామంలో కుస్తాపూర్ అంజనాబాయి–బాబు దంపతుల నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జి.వితల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబాల సొంత ఇంటి కల నెరవేరడం ఎంతో సంతోషకరమన్నారు. లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు వేడమా బొజ్జు పటేల్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకలో సర్పంచ్ మడి ప్రవీణ్, సాయినాథ్, దేవేందర్, ఏఎంసీ డైరెక్టర్ రాథోడ్ అరుణ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, నాయకులు ఆనంద్ రావు, సాగర్ బాయి, కండెల రాజన్న,శంకర్, సూది రాజన్న, సంతోష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు
యూనిఫాం దుస్తుల పంపిణీ





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, నవంబర్ 11 (ప్రజా కలం) కోనారావుపేట గ్రామం లోని అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారు లకు యూనిఫాం దుస్తులను సర్పంచ్ మారు గంగారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాం దుస్తులు అందజేసి, వారి విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్ జక్కని పరంధా ములు, పంచాయతీ కార్యదర్శి పట్నం రాణా ప్రతాప్, వార్డు సభ్యులు నల్ల దేవయ్య, సంగర్తి సాయిలు, సంగర్తి మమత, కారోబార్ పుల్ల శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, సుజాత, స్వప్న, ఆయాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే చేపట్టాలి
- రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



పెద్దపల్లి,నవంబర్11:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా,అత్యంత నాణ్యతతో,పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.తొందరపాటుతో ఎలాంటి తప్పులకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. పెద్దపల్లి ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నవంబర్ నెలాఖరు లోగా ప్రతి జిల్లాలో తొలి విడత కింద ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.రాబోయే ఏడాదిన్నరలో మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.పనులను వేగవంతం చేసేందుకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.రైతుల సమక్షంలోనే సర్వే జరగాలని,ముందస్తు నోటీసులు ఇచ్చి అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.సర్వే పూర్తయిన తర్వాత దండోరా వేయించి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాల న్నారు.అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. అసైన్డ్ భూముల పట్టాలు,విస్తీర్ణంలో తేడాలు,పూర్వపు భూసేకరణ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. రీసర్వేలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమీక్షలో ఆర్డీఓలు గంగయ్య,సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే మహోజ్వల భవిష్యత్తు
- పెద్దపల్లి డీసీపీ బి. రామిరెడ్డి



సుల్తానాబాద్,నవంబర్11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

యువత,విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి,ఉన్నత లక్ష్యాలను సాధించాలని పెద్దపల్లి డీసీపీ బి.రామిరెడ్డి పిలుపునిచ్చారు.సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో గారెపల్లిలోని ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్‌లో గారెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం మత్తు పదార్థాల దుష్ప్రభావాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ బి.రామిరెడ్డితో పాటు ప్రముఖ వక్త ఎస్.పి.నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.మత్తు పదార్థాల బారిన పడితే శారీరక,మానసిక ఆరోగ్యాలు దెబ్బతినడమే కాకుండా,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుం దని వారు హెచ్చరించారు.జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు.సమాజాన్ని పట్టిపీడి స్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిం చారు. ఈ అవగాహన సదస్సులో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు,ఎస్ఐ చంద్రకు మార్,ఎలిగేడు ఎస్ఐ మధుకర్,కె.శ్రీరాంపూర్ ఎస్ఐ సుధాకర్,పలువురు పోలీసు సిబ్బంది,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుల రక్షణ కోసం కాటమయ్య కిట్ల పంపిణీ



ధర్మారం, నవంబర్ 11 :(ప్రజాకలం ప్రతినిధి) మండల కేంద్రం లో బుధవారం రోజున ప్రభుత్వం గీత కార్మికుల రక్షణ కోసం రాష్ట్ర మంత్రు లు పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం గీత కార్మికుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కాటమయ్య రక్షణ కిట్లను ధర్మారం మండల కేంద్రం లోని గీత కార్మికుల కు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. స్థానిక ఎల్లమ్మ దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమం లో ట్రైనర్ జాగిరి అంజయ్య గౌడ్ గీత కార్మికులకు కిట్లను ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ శాఖ ప్రతినిధి దినేష్, గౌడ సంఘం అధ్యక్షులు పాలకుర్తి రాజేశం గౌడ్, ఉపాధ్యక్షులు తొడేటి తిరుపతి గౌడ్, వార్డు సభ్యులు గాజుల రాజు గౌడ్, బొమ్మగాని సతీష్ గౌడ్, నాయకులు తొడేటి రాజలింగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో అసిస్టెంట్ లైన్‌మెన్ దుర్మరణం



పెద్దపల్లి,నవంబర్11:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) విద్యుత్ విధులు నిర్వహిస్తూ మరమ్మతులు చేపడుతుండగా జరిగిన ఘోర ప్రమాదంలో ఓ అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రాణాలు కోల్పోయారు.పెద్దపల్లి పట్టణ పరిధిలోని రంగంపల్లిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.స్థానికులు,తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... విద్యుత్ శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న వేల్పుల మహేష్ (36) బుధవారం సాయంత్రం రంగంపల్లి ప్రాంతంలో విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతు పనులు చేపట్టారు.అయితే, అదే సమయంలో ఊహించని విధంగా స్ట్రీట్ లైట్ల విద్యుత్ సరఫరా ఆన్ కావడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రసారమైంది.తీవ్రమైన విద్యుత్ షాక్‌కు గురైన మహేష్,నియంత్రణ కోల్పోయి స్తంభం పైనుంచి కింద పడిపోయారు.తలకు,శరీరానికి బలమైన గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు.సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ అధికారులు,తోటి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే ఉద్యోగి ఇలా అకాల మరణం చెందడంతో తోటి సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులు విచారణ ప్రారంభించారు.మృతుడికి భార్య,ఒక కుమార్తె,ఒక కుమారుడు ఉన్నారు.కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మహేష్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.బాధితుడి కుటుంబాన్ని ప్రభుత్వం,విద్యుత్ శాఖ ఆదుకోవాలని స్థానికులు,ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

ట్రాఫిక్ రద్దీ ప్రమాదాల నివారణకు చర్యలు
- పెద్దపల్లిలో నూతన ట్రాఫిక్ నిబంధనలు
- పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ బి.శ్రీనివాస్

పెద్దపల్లి,నవంబర్11:(ప్రజా కలం జిల్లాప్రతినిధి)పెద్దపల్లి పట్టణంలోని కమాన్ ప్రాంతంలో రోజురోజుకూ రద్దీ విపరీతంగా పెరుగుతుండటంతో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు కీలక మార్పులు చేపట్టారు. జెండా సుభాష్ నగర్ మీదుగా కరీంనగర్ వైపు వెళ్లే ప్రతి వాహనం కమాన్ వద్ద నేరుగా వెళ్లకుండా, తప్పనిసరిగా ఎడమవైపు తిరిగి,కునారం జంక్షన్ వరకు వెళ్లి అక్కడ యు-టర్న్ తీసుకోవాల్సి ఉంటుంది.కమాన్ కూడలి వద్ద ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సాఫీగా



రాకపోకలు సాగేందుకు ఈ నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు.పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు,వాహనదారులు ఈ నిబంధనలను తప్పక పాటిస్తూ,పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శునకాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురైన ఆటో..
మహిళ దుర్మరణం..మరో ఇద్దరికి గాయాలు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 11(ప్రజా కలం):శు నకాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురైన సంఘటనలో మహిళ దుర్మరణం పాలైన సంఘటన చోటుచేసుకుంది. మెట్‌పల్లి నుంచి బండలింగాపూర్‌కు వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్ కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్ గ్రామానికి చెందిన నాగేల్లి లస్మవ్వ (62) తన కోడలు నాగేల్లి లక్ష్మీ (37)తో కలిసి బుధవారం పనిమీద మెట్‌పల్లికి వచ్చిందన్నారు. పని ముగించుకుని తిరిగి బండలింగాపూర్ వెళ్లేందుకు కొత్త బస్టాండ్ వద్ద ఆటోలో ఎక్కారని, ఆటో బండలింగాపూర్‌కు వెళ్తుండగా సాయంత్రం సమయంలో వెల్లుల్ల రోడ్డులోని దుర్గ వెల్డింగ్ షాప్ సమీపంలో డ్రైవర్ మూదం లింగం అలియాస్ చింతకింది గంగారం ఆటోను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్‌కు ఎడమవైపు కూర్చున్న నాగేల్లి లస్మవ్వ రోడ్డుపై పడగా, ఆమెపై ఆటో పడటంతో ముఖం, ఛాతీ భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న ముధం చిన్నరాజు, కోరే మల్లుకు తల, చేతులకు గాయాలయ్యాయని,మృతురాలి కోడలు నాగేల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ వెల్లడించారు.

స్థల వివాదంలో పొరుగింటి దాష్టీకం
- ఇరువర్గాల మధ్య ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు



పెద్దపల్లి,నవంబర్11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పట్టణంలోని సుభాష్ నగర్‌లో స్థానిక నివాసితులైన అడప సంతోష్,పొరుగింటికి చెందిన పడాల శంకర్‌ల మధ్య భూమి విషయమై తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. సంతోష్‌కు చెందిన స్థలాన్ని శంకర్ కబ్జా చేస్తున్నాడనే విషయమై మొదలైన వాగ్వాదం క్రమంగా ముదిరి, పరస్పర దూషణల అనంతరం భౌతిక దాడులకు దారితీసింది.పడాల శంకర్ వర్గీయులు అడప సంతోష్‌పై చేయి చేసుకోవడంతో ఇరువర్గాలు పిడిగుద్దులతో పరస్పరం దాడులు చేసుకున్నారు.కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద స్థలంలో శంకర్ అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించగా,తాము అడ్డుకున్నందుకు దాడి చేశారని సంతోష్ ఆరోపించారు.ఈ దాడిలో సంతోష్ కాలుకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోగా, స్థానికులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు.బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెద్దపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో జువ్వాడి కృష్ణారావు



మల్లాపూర్, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి)

ఇందిరమ్మ ఇళ్ల తో పెదోళ్ళ కల సాకారం అవుతుందని, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల తో వారి ఇళ్లలో వెలుగులు నింపామని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణా రావు అన్నారు. వాల్గొండ తండా గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి జువ్వాడి కృష్ణారావు హాజరై లబ్ధిదారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ సురేష్, ఉ పసర్పంచ్ శ్రీనివాస్, వాల్గొండ సర్పంచ్ వసంత, కిసాన్ సెల్ అధ్యక్షుడు జలపతి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, నాయకులు జమాల్, రాజేందర్, కిషన్, కిరణ్, రవి, గంగాధర్, ప్రభాకర్, ఆశయ్య, యువజన నాయకులు బద్ది విక్కీ, గౌతమ్, నరేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడు కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు దామాల రవి



పాలేరు నవంబర్ 11(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం పట్టణ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం కి చెందిన. దేవరకొండ రాము . మృతి చెందిన విషయాన్ని పాలేరు మాజీ శాసన సభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి అభిమాని, బెల్లం వేణు గోపాల్ అనుచరుడు 59వ డివిజన్ బి.ఆర్. యస్ పార్టీ. మాజీ అధ్యక్షులు దామాల రవన్న తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి దశదిన కార్యక్రమానికి ఆర్థిక సహాయం రూ 5000/- వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. దామాల రవి, వారి కుటుంబాన్నీ ఓదార్చి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఎల్లవేళలా మీ కుటుంబానికి బి.ఆర్. యస్ పార్టీ, నేను అండగా ఉంటానని, ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామని వారికి ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో 59 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లూరి మధుబాబు, అనబత్తుల వెంకటేశ్వర్లు, మద్దెల ఉపేందర్, నాగటి బిక్షం. సామిరెడ్డి లింగారెడ్డి. కోడిపుంజుల సీతారాములు. వెంపటి సంతోష్ బత్తుల రవి,మరపాక కరుణాకర్,కొట్టే పాపారావు, జాల కోటయ్య, బత్తుల వెంకన్న, నాగంటి. సంగయ్య. గురుమూర్తి, షేక్ నాగులమీరా, పసుపులేటి కృష్ణ,జానీ, మద్దెల ఉదయ్, చిటిక వినయ్, దార నాగరాజు, మద్దెల వినయ్, షేక్ అంజాద్, మట్టపల్లి ఉదయ్. వెలుపుల మల్లి కార్జున్, పెండ్రా ప్రసాద్, బండి శ్రీకాంత్, వల్లెపు ప్రవీణ్, బండి కార్తీక్,రాజేష్,రాము. అబ్బు. చింతల వేణు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


పట్టాల పరిధి దాటిన గూడ్స్ ఇంజిన్
-తప్పిన పెను ప్రమాదం ..అప్రమత్తమైన రైల్వే వర్గాలు

పెద్దపల్లి,నవంబర్ 11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పట్టణంలోని కూనారం రైల్వే గేట్ సమీపంలో బుధవారం ఒక గూడ్స్ రైలు ఇంజిన్ పట్టాల చివర ఉన్న డెడ్‌లైన్‌ను దాటి ముందుకు వెళ్లింది.ఈ ఘటనతో రైల్వే యంత్రాంగం ఒక్కసారిగా ఉ లిక్కిపడింది.ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం సంభవించకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. షంటింగ్ చేస్తుండగా ఘటన రైళ్ల రాకపోకలకు మార్గాన్ని క్లియర్ చేసే క్రమంలో భాగంగా స్టేషన్ పరిధిలో బోగీలను ఇతర లైన్లకు తరలిస్తుంటారు.ఇందులో భాగంగా కూనారం గేట్ వద్ద షంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా,గూడ్స్ ఇంజిన్ నియంత్రణ కోల్పోయి నిర్ణీత ట్రాక్ డెడ్‌లైన్‌ను దాటి ముందుకు దూసుకెళ్లింది. విషయం తెలిసిన వెంటనే రైల్వే సాంకేతిక సిబ్బంది,ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.ట్రాక్ నుంచి ముందుకు వెళ్లిన ఇంజిన్‌ను తిరిగి యథాస్థితికి చేర్చేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.డెడ్‌లైన్ దాటడానికి సిగ్నలింగ్ లోపమా లేక సాంకేతిక సమస్య కారణమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.ప్రమాదం తప్పడంతో స్థానికులు,ప్రయాణికులు ఊరట చెందారు.



పాగుంట వెంకన్నను దర్శించుకున్న సరిత తిరుపతయ్య



గద్వాల ప్రతినిధి, నవంబర్ 11 (ప్రజా కలం):జోగులాంబ గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన పాగుంట శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, TGSGDCFL చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య బుధవారం పాగుంట వెంకన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి (ఈవో) పురేందర్, సర్పంచులు బాలకృష్ణ, రఘు, నాయకులు అల్వాల రాజశేఖర్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి పట్టణంలో రెండో వార్డ్ లో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...

బెల్లంపల్లి, నవంబర్ 11, (ప్రజాకలం) ప్రతినిధి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ,మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ ఆదేశాల మేరకు,పట్టణం లోని 2వ వార్డులో అనారోగ్యంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీ.ఎం.ఆర్.ఎఫ్) చెక్కులను బుధవారం డిసిసి వైస్ ప్రెసిడెంట్ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ నిచ్చకోల వంశీకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నిచ్చకోల



వంశీ కృష్ణ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని,ఎవరూ వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడవద్దని ఉ ద్దేశంతోనే చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలకు ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు. రెండవ వార్డు కు చెందిన జనగామ శ్రీనివాస్,మంతెన హరిబాబు కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.కష్టకాలంలో వైద్య ఖర్చు నిమిత్తం ప్రభుత్వం సహాయం చేసేందుకు కృషి చేసిన నిచ్చకోల వంశీకృష్ణకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాలమూరు ప్రజల నీటి హక్కులను కాలరాసిన గత బీఆర్ఎస్ పాలకులు

జూరాల నీటిని శ్రీశైలానికి తరలించడంలో ఆంతర్యమేమిటి?

ఉమ్మడి జిల్లా వెనుకబాటుతనంపై నాడు బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడలేదు?

కొడంగల్‌లో ఇండస్ట్రియల్ కారిడార్‌తో లక్ష మంది యువతకు ఉపాధి : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి
నవంబర్ 11:

పాలమూరు ప్రజల సాగునీటి హక్కులను పరిరక్షించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి విమర్శించారు. జూరాల నుంచి నీటిని వినియోగించుకుని ఎండిపోతున్న తెలంగాణ బీడు భూములను తడపాల్సి ఉండగా, శ్రీశైలం వైపు నీటిని తరలించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పాలమూరు ప్రజల సాగునీటి హక్కులకు అన్యాయం.జరుగుతున్నప్పుడు నాడు మంత్రులుగా పనిచేసిన వారు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబాటుతనం, కృష్ణా జలాల వినియోగంలో జరిగిన అన్యాయం, ప్రజల వలసలు కూడా ప్రధాన కారణాలని యెన్నం పేర్కొన్నారు. తెలంగాణ యువత బలిదానాలకు చలించి సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలకులు పదవులను అనుభవించారే తప్ప పాలమూరు అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. జూరాల నీటిని కోయిల్‌సాగర్‌కు తరలించి, అవసరమైన మేరకు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి ఉంటే దిగువ ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరేదని అన్నారు. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ దిశగా సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తక్కువ వర్షపాతం, సాగునీటి వసతుల కొరత, పేదరికం, వలసలతో ఎన్నో ఏళ్లుగా వెనుకబడి ఉందని యెన్నం అన్నారు. ముఖ్యమంత్రి లిశ్రీ రేవంత్ రెడ్డి లి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ పరిస్థితులను మార్చేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీరు, తాగునీరు అందించే దిశగా ముందడుగు వేసిందన్నారు. గతంలో పాలమూరు ప్రాంతం ఎదుర్కొన్న సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ఎందుకు గళమెత్తలేదని ప్రశ్నించారు. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 180 కిలోమీటర్ల మేర కేసిఆర్ తన ఫాం హౌస్ వరకు మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ఇలా అనేక ప్రాజెక్టులు నిర్మించినప్పుడు మీ నోరు ఎందుకు మూతపడ్డదని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెక్‌డ్యాంల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించినప్పుడు పాలమూరు అవసరాలను ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. పదేళ్ల పాలనలో ఒక తరం జీవితాలు వలసలు, పేదరికం మధ్యనే గడిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ ప్రాంతంలో సుమారు 5,000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. పలు కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయని, పరిశ్రమలు ఏర్పాటైతే లక్ష మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. పారిశ్రామిక అభివృద్ధితో స్థానిక యువతకు ఉద్యోగాలు లభించడంతో పాటు బాంబే, పుణే వంటి నగరాలకు వలసలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైవే నుంచి కొడంగల్‌కు ఎనిమిది వరుసల రహదారి పూర్తయితే శంషాబాద్ నుంచి సుమారు గంటలోనే చేరుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కొడంగల్ భౌగోళికంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతమని పేర్కొన్నారు. కొడంగల్ ప్రాంతంలో విద్యా సదుపాయాలను విస్తరించేందుకు సుమారు 250 ఎకరాల్లో ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే వివరించారు. వివిధ రకాల విద్యాసంస్థలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జడ్చర్ల సెజ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 30 వేల మంది ఉపాధి పొందుతున్నారని గుర్తుచేస్తూ, అదే తరహాలో కొడంగల్‌లోనూ పరిశ్రమల అభివృద్ధి జరిగితే స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, లా కళాశాల ఏర్పాటు చేయడంలో గత పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఈ కళాశాలలను తీసుకువచ్చామని తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న వ్యాఖ్యలను యెన్నం తప్పుబట్టారు. నార్లాపూర్ వద్ద రెండు పంప్ ల ఏర్పాటు, కర్వెన , ఉదండాపూర్ వద్ద భూసేకరణ సహా పలు పనులు అసంపూర్తిగా ఉన్నాయని పేర్కొంటూ, పనులు పూర్తి కాకుండానే 90 శాతం పూర్తయ్యాయని ఎలా చెబుతారని ప్రశ్నించారు. గతంలో ఉదండాపూర్ భూ నిర్వాసితులకు తక్కువ పరిహారం అందించారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన నిర్వాసితులకు రూ. 18 లక్షల పరిహారం అందించామని తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కృష్ణా జలాల వంపిణీలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా కోసం ముఖ్యమంత్రి లిశ్రీ రేవంత్ రెడ్డి లి పోరాడుతున్నారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణకు 558 టీఎంసీల కృష్ణా జలాలు రావాల్సిందేనని డిమాండ్ చేశారు. గతంలో తెలంగాణకు తక్కువ నీరు కేటాయించిన పరిస్థితులపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో గత పాలకులు జరిపిన చర్చలు, కృష్ణా జలాల విషయంలో అనుసరించిన వైఖరిపై కూడా ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రయోజనాలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని యెన్నం తెలిపారు. రెండేళ్లలో ఉమ్మడి జిల్లాలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేశామని, ఇందుకు సంబంధించిన లెక్కలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. సాగునీరు, విద్య, పరిశ్రమలు, రహదారులు, ఉపాధి రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. పాలమూరు పేదరికం, వలసలకు శాశ్వత పరిష్కారం చూపడం, రైతులకు సాగునీరు అందించడం, యువతకు స్థానికంగా ఉద్యోగాలు కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ,ఎన్ పి వెంకటేష్, సిజే బెనహర్, మైత్రి యాదయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు : పాల్గొన్న అదనపు కలెక్టర్లు



నిర్మల్ నవంబర్ 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు లు పాల్గొన్నారు.ఈ జయంతి వేడుకలలో భాగంగా ముందుగా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప పాత్ర పోషించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశానికి మౌలానా తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలు అందించారని వివరించారు. విద్యాశాఖ మంత్రిగా విద్యారంగానికి ఆయన విశిష్ట సేవలు అందించారని వివరించారు. విద్యారంగం అభివృద్ధికి నిరంతరం శ్రమించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. భారతదేశ విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. మౌలానా అబుల్ కలాం వంటి మహనీయుల జయంతి వేడుక ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు.

ఈ జయంతి వేడుకలలో డిఈఓ భోజన్న, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, మైనారిటీ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన కందాళ

పాలేరు నవంబర్ 11(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోనే బుధవారం రాజుపేట, గొర్లపాడు తండా, లోక్య తండా గ్రామంలో ఇటీవల కాలంలో స్వర్గస్తులైన సంద్ర మదారు, బానోత్ దేవేందర్,వడ్త్యా వెంకటేశ్వర్లు, కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించిన పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, జిల్లా నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పేదల మోములో చిరునవ్వులు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్
ప్రజాకలం ప్రతినిధి నవంబర్ 11:

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్, లింగన్నపల్లి, అత్యకుంట తండాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో పేదలకు సొంతింటి కల కలగానే మిగిలిపోయేదని, వారి కష్టాలను, బాధలను అర్థం చేసుకున్న ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు సొంతింటి భాగ్యం కలుగుతోందని, సొంత ఇంటిలో గౌరవంగా జీవించాలన్న వారి చిరకాల ఆకాంక్ష నెరవేరుతోందని పేర్కొన్నారు. ఈ ఏడాది వేలాది కుటుంబాలు తమ సొంత ఇళ్లలో దీపావళి పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ, ప్రతి కుటుంబానికి భద్రతతో కూడిన నివాసాన్ని కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, మండల అధ్యక్షులు మహేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి,డిసిసి కార్యదర్శి వెంకటయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు అంజన్న నాయకులు కృష్ణారెడ్డి , గంగిరెడ్డి తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల భాగస్వామ్యంతోనే ఓటర్ల జాబితా పారదర్శకత

సమగ్ర ఓటర్ సవరణ, ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్



ఖమ్మం, నవంబర్ 11(ప్రజా కలం న్యూస్)

రాజకీయ పార్టీల పూర్తి భాగ స్వామ్యం, సమన్వయంతోనే పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమగ్ర ఓటర్ల సవరణ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో నివాసంలో లేనివారు, స్థలం మారినవారు, మృతి చెందినవారు, నకిలీ/రెండోసారి నమోదైన ఓటర్ల పేరుతో ఏఎస్ డిడి కేటగిరీ కింద తొలగించిన ఓటర్లకు తుది జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి వ్యాప్తంగా మొత్తం 1,57,854 మందిని ఏఎస్ డిడి కేటగిరీ కింద గుర్తించినట్లు తెలిపారు. ఇందులో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారినవారు 1,01,549 మంది, మరణించినవారు 33,380 మంది, ఇతర నియోజకవర్గాల్లో ముందే ఓటు నమోదు పొందినవారు 11,004 మంది, గైర్హాజరైనవారు 11,371 మంది ఉన్నారన్నారు. వీరందరికీ సవరణ ప్రక్రియ కింద నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు జారీ చేసిన 1,75,840 నోటీసులలో 1,75,753 నోటీసులను పంపిణీ చేసి విచారణ నిర్వహించినట్లు స్పష్టం చేశారు. నోటీసుల విచారణ ప్రక్రియను నవంబర్ 26 నాటికి పూర్తి చేసి, నవంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. తొలగించబడిన ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో, సీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ప్రత్యేక ఎన్యూమరేషన్ ఫారం ద్వారా తమ ప్రస్తుత నివాస పరిధిలోని ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ/బిఎల్ఓ లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు (ఫారమ్-18) పురోగతిపై కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 6 నాటికి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,09,942 ఫారమ్-18 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో ఇప్పటివరకు 52,163 దరఖాస్తులను ఆమోదించామని, 2,353 దరఖాస్తులను నిబంధనల ప్రకారం తిరస్కరించామని, మిగిలిన 55,426 దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ/బిఎల్ఓల స్థాయిలో వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. నవంబర్ 20 నాటికి డ్రాఫ్ట్ రోల్ తయారీ పూర్తి చేసి, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, డిసెంబర్ 30న ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా విడుదలవుతుందని అన్నారు. ?మధ్యలో పెండింగ్‌లో ఉన్న కొత్త ఓటరు నమోదు (ఫారమ్-6), ఆక్షేపణలు (ఫారమ్-7), మార్పులు/చేర్పులు (ఫారమ్-8) దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నిబంధనల మేరకు నూతన పోలింగ్ కేంద్ర ఏర్పాట్లకు ప్రతిపాదనలు చేసినట్లు, ఇట్టి ప్రతిపాదనలపై అభ్యంతరాలు వుంటే వ్రాతపూర్వకంగా శనివారం లోగా తెలపాలని కలెక్టర్ అన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్లను చురుగ్గా భాగస్వాములను చేసి, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి విడిపోకుండా సహకరించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల డీటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఎస్పి పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, టీడీపీ పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బి. వేణుగోపాల్, మంకెన రమేష్, సిపిఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, సీపీఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఏ. విప్లవ కుమార్, ఐఎన్సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి
నవంబర్ 11:

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకం పురోగతి, వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనుల మంజూరు, పెండింగ్ పనులపై సమగ్రంగా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హాజరయ్యారు. డీఆర్‌డీఓ నర్సింహులు, డీపీఓ వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా జాబ్ కార్డుల స్థితిగతులు, కూలీల సమీకరణ, మేట్ల నియామకం, స్థానీకరణ, శిక్షణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. జలసిరి పనులు, మెటీరియల్ కాంపోనెంట్ జనరేషన్‌పై సమీక్ష నిర్వహించారు.అలాగే నూతన గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామ సంఘాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల మంజూరు ప్రతిపాదనలతో పాటు గ్రామీణ నీటి సరఫరా మరమ్మతు పనులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనుల మంజూరుపై చర్చించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, పనుల జియో ట్యాగింగ్, జల్ శక్తి అభియాన్ కార్యక్రమం అమలు, పురోగతిని కూడా సమీక్షించారు.ఈ సందర్భంగా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం, పెండింగ్ పనులను త్వరితగతిన పరిష్కరించడం, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించడం, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించడంపై దృష్టి సారించాలని కమిషనర్ దివ్య దేవరాజన్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెంపొందించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె దిశానిర్దేశం చేశారు.

బాసర ఐఐఐటీ విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీరు అందించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నిరంతరం పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం బాసర ఐఐఐటీ (ఆర్జీయూకేటీ)లో విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, క్యాంపస్‌లో నీటి సరఫరా సమస్యలు, ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీటి నాణ్యతను పరీక్షించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలని సూచించారు. నీరు ఎక్కడ కలుషితమవుతుందో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటితో పాటు రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ సమావేశంలో ట్రైసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళి దర్శన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన తల్లాడ మండల సర్వసభ్య సమావేశం



తల్లాడ, నవంబర్ 11 (ప్రజా కలం న్యూస్): తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీధర్ రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మండల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించడం జరిగింది. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపిడిఓ అధికారులకు, సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచులు ఈ సమావేశంలో ఎంపిడిఓ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన నిలిచినందుకు కేసులా?
బాసు శ్యామల ఆగ్రహం!

జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని రైతుల ధర్నాకు మద్దతు.. మాజీ జడ్పీటీసీకి పోలీసుల నోటీసులు

గద్వాల ప్రతినిధి, నవంబర్ 11 (ప్రజా కలం):

జూరాల ప్రాజెక్టు నుంచి రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా నిలిచిన మాజీ జడ్పీటీసీ బాసు శ్యామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు



నవంబర్ 11న ఆమె నివాసానికి వెళ్లిన పోలీసులు నోటీసులు అందజేశారు.గత సెప్టెంబర్ 21, 2026న జూరాల ప్రాజెక్టు నుంచి వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జమ్మిచేడు సమీపంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనకు మద్దతుగా మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల పాల్గొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా బాసు శ్యామల మాట్లాడుతూ.. “రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కితే కేసులు పెడతారా? రైతులకు మద్దతుగా నిలిస్తే కేసులు నమోదు చేస్తారా? ఎన్ని కేసులు పెట్టినా రైతుల పక్షాన నిలబడతాం. రైతుల సాగునీటి హక్కుల కోసం మా పోరాటం ఆగదు” అని అన్నారు.రైతుల సంక్షేమమే లక్ష్యమని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం జూరాల సాగునీటి సమస్యపై స్పందించాలని, రైతులకు తక్షణమే సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు కావాల్సింది కేసులు కాదు.. సాగునీరు, భరోసా, న్యాయం అని పేర్కొన్నారు.

ఎల్‌నినో ముప్పుపై ప్రజలకు అవగాహన.. జల సంరక్షణకు పిలుపు!

గద్వాల ప్రతినిధి (ప్రజా కలం):జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం నేతువానిపల్లె గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగ కళాకారులు ఎల్‌నినో ప్రభావం, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు, జిల్లా



కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా సూచనలు, సలహాల మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు తమ ఆటపాటలు, మాటల ద్వారా ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని, నీటిని వృథా చేయకుండా జల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వేసవిలో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, గ్రామ పరిసర ప్రాంతాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఎండల తీవ్రత దృష్ట్యా రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మా వెంకటేష్ నాయక్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, గ్రామ అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు హజరత్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంతో తక్కువ నీటితో
అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో గో ఆధారిత సమీకృత సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్

సౌరశక్తితో పనిచేసే సోలార్ పాలీ టన్నెల్ ప్రారంభం - రసాయన రహిత సాగుతో నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అవకాశం

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి
నవంబర్ 11:

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగి తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.బుధవారం జడ్చర్ల మండలం ఈర్లపల్లి గ్రామంలో రైతు రాజవర్ధన్ రెడ్డి 34 ఎకరాల్లో అభివృద్ధి చేసిన గో ఆధారిత సమీకృత సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సౌరశక్తితో పనిచేసే సోలార్ పాలీ టన్నెల్‌ను ప్రారంభించారు.క్షేత్రంలో అమలు చేస్తున్న గో ఆధారిత సేంద్రీయ వ్యవసాయ విధానాలు, వివిధ రకాల పంటల సాగు, పశుపోషణ, మునగతో పాటు ఇతర ఉద్యాన పంటల పెంపకం, సౌరశక్తి సహాయంతో మునగ ఆకుల పొడి తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన సహజ ఎరువుల వినియోగం, తక్కువ నీటి వనరులతో పంటలు సాగు చేస్తున్న విధానాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుల నుద్దేశించి మాట్లాడుతూ కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రంలో ఏ మొక్కను ఎక్కడ నాటాలి, వాటి మధ్య అంతర పంటలుగా ఏయే పంటలను సాగు చేయాలి, తద్వారా నేల సారం, పర్యావరణ సమతుల్యతతో పాటు రైతులకు ఏ విధంగా ప్రయోజనం చేకూరుతుందనే అంశాలను శాస్త్రీయ అవగాహనతో అమలు చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఇలాంటి సమీకృత వ్యవసాయ క్షేత్రాలు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును వ్రణాళికాబద్ధంగా చేవట్టాలని సూచించారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, కూరగాయలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగుపై



అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉంటాయని వివరించారు. సేంద్రీయ వ్యవసాయంలో ప్రారంభ దశలో నిరంతర పర్యవేక్షణ, తగిన శ్రద్ధ అవసరమని, అయితే రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా దీర్ఘకాలంలో నేల సారం పెరగడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడుతుం దని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో యువత భాగ స్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని, ఐటీ వంటి ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారు సైతం సేంద్రీయ వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం సంతోషకరమన్నారు. రైతుల పిల్లలు వ్యవసాయానికి దూరం కాకుండా ఆధునిక సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై వారికి అవగాహన, శిక్షణ కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, మారుతున్న ఆహారపు అలవాట్లు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటూ, రైతులు తమ కుటుంబ అవసరాల కోసం కొంత భూమిలోనైనా రసాయన రహిత ఆహార పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలున్న ఆహార పదార్థాలను నిత్యాహారంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ వ్యవసాయంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పిస్తూ రైతులకు మార్గదర్శకత్వం అందిస్తున్న విజయరామ్, హుస్సేన్ బాబు, ముకుంద రెడ్డి తదితరుల సేవలను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో మరిన్ని సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటుకు, రైతులు, యువతకు అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సేంద్రీయ వ్యవసాయ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.


యాసంగిలో వరికి బదులు తక్కువ నీటి పంటలు సాగు చేయాలి

- రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచన



పాలేరు నవంబర్ 11(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోనే బుధవారం తురకగూడెం గ్రామంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా భూగర్భ జలమట్టం తగ్గిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో యాసంగి సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయకు ండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచిం చారు. తక్కువ నీటితో సాగు చేసుకునే పెసర, మినుము, వేరుశనగ, జొన్న వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని కోరారు.అనంతరం కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్ మాట్లాడుతూ భూగర్భ జలమట్టం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు వంటల మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఉద్యాన అధికారి అపర్ణ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలను వివరించారు. రైతులు కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సహాయ ఇంజినీర్ నవీన్, గ్రామ సర్పంచ్ బుర్ర కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, రఘు, రవి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలని తహశీల్దార్, వ్యవసాయ అధికారికి వినతి..



తల్లాడ నవంబర్ 11 ప్రజాకలం న్యూస్ ఇటీవల మురసు తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు పంట నష్ట సర్వే చేయించి పరిహారం చెల్లించాలని కోరుతూ తల్లాడ మండలంలోని గొల్లగూడెం గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవివీరకృష్ణ దంపతులు బుధవారం తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి తాజుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. మండల పరిధిలోని తల్లాడ, తెలగవరం, పినపాక రెవిన్యూ లో గొల్లగూడెం గ్రామపంచాయతీకి చెందిన రైతులు ఖరీఫ్ లో వరి పంట సాగు చేశారని తెలిపారు. ఇటీవల కురిసిన తుఫాన్ ప్రభావానికి వరిపంట నేలవాలీ నష్టం జరిగిందని, అట్టి పంట నష్టాన్ని గుర్తించి సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని వినతిలో పేర్కొన్నారు.

భూ రీసర్వేను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి

రైతులకు అవగాహన కల్పించి, భూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చొరవ చూపాలి

సర్వే అనంతరం అభ్యంతరాల స్వీకరణపై రైతులకు స్పష్టతనివ్వాలి - కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి
నవంబర్ 11:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులు నమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు.
రీసర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి నంబంధిత గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని అలాగే కలెక్టర్లు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే నమన్యల వరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూమి విస్తీర్ణం ఎంత? రీసర్వే అనంతరం గుర్తించిన విస్తీర్ణం ఎంత? అనే వివరాలను భూ యజమానులకు తక్షణమే తెలియజేయాలని ఆదేశించారు. భూ యజమానులకు ఎలాంటి సందేహాలు, అపోహలు లేకుండా సర్వే ప్రక్రియపై పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు, రెండు రోవర్లను సమకూర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం 708 రోవర్లతో సర్వే కొనసాగుతోందని, మరో వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.
బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ లతో కలిసి
జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే శాఖ అధికారులతో రీసర్వే, హౌసింగ్ అంశాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
క్షేత్రస్థాయి అధికారుల సూచనలతో ఎన్ఓపీలో మార్పులులిరీనర్వే నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) జారీ చేసిందని మంత్రి తెలిపారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఎస్ఓపీని సక్రమంగా అమలు చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భిన్నమైన పద్ధతులు అనునరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.క్షేత్రస్థాయి అధికారుల అనుభవాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని ఎన్ఓపీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపేలా మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు.
రీసర్వే సమస్యలపై తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సుదీర్ఘ సమీక్షలు రీసర్వే అమలు తీరుపై ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులతో పాటు జిల్లాల వారీగా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మండల స్థాయి రెవెన్యూ, సర్వే అధికారులతో సుదీర్ఘంగా సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి అధికారులతో న్వయంగా నమావేశమై, ఒక్కో సమావేశంలో ఐదు నుంచి ఆరు గంటల పాటు రీసర్వేలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు.
. భూముల విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు, ఇతర భూ వివాదాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.
రెవెన్యూ--ఫారెస్ట్ భూ సరిహద్దుల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి
రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఇరు శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిహద్దులను నిర్ధారించాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
సర్వేలో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అభినందనలు.. నిజామాబాద్‌పై అసంతృప్తి
రీసర్వే నిర్వహణలో వెనుకబడిన జిల్లాలు పనితీరును మెరుగుపరుచుకొని నిర్దేశిత లక్ష్యాల మేరకు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అర్హులైన పేదలకు త్వరితగతిన లబ్ధి చేకూర్చాలని మంత్రి ఆదేశించారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను తక్షణమే గుర్తించి, సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు.
2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
రెండు పడక గదుల (2బీహెచ్‌కే) ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నప్పటికీ, ఆయా ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లను తక్షణమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.
22ఏ భూముల సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి
22ఏ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ కొన్ని జిల్లాల్లో ఇంకా నమన్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు.
రీసర్వే, గృహ నిర్మాణం, 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వేగం, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం వి సి.కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ, ఆర్.డి.ఓ నవీన్,గృహ నిర్మాణ శాఖ పి.డి. ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

హర్షగూడ గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి



మహేశ్వరం , నవంబర్ 11, (ప్రజా కలం) మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి మంఖల్ జిహెచ్ఎంసి హర్షగూడ గ్రామానికి చెందిన మూడవత్ శ్రీను (పోలీస్) మరణించిన విషయం తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం మృతుడి తల్లిగారికి, భార్యగారికి మనోధైర్యం కల్పిస్తూ, తాము ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ జటావత్ రవి నాయక్, మాజీ కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్, సుమన్, శ్యామల, రాజు, వెంకట, రాజిరెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ జరుపుల రాజు, మంగమ్మ, దేవిజా, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు సురేష్ నాయక్, యువ నాయకులు రామావత్ రమేష్ నాయక్, యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, నేస్తం యూత్ అధ్యక్షుడు సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి దంపతులు



కందుకూరు, నవంబర్ 11,(ప్రజా కలం):

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, దెబ్బడగూడ మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి దంపతులు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రికి వివరించినట్లు ఏనుగు జంగారెడ్డి తెలియజేశారు. అలాగే కందుకూరు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలని జంగారెడ్డి దంపతులు ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు.దీనికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీలో అంతర్భాగమైన కందుకూరు మండలం అంచెలంచలుగా అభివృద్ధి చెంది, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మండలంగా ఏర్పాటు కాబోతుందని తెలియజేశారు.డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న మరో గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ వేదికగా మారబోతుందని, దీంతో కందుకూరు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కర్తాల్, ఆమనగల్ తదితర మండలాలు ఈ వేదికలో పాలుపంచుకోవడం జరుగుతుందని ముఖ్యమంత్రి వెల్లడించినట్లు వారు తెలియజేశారు.

కీచక వైస్ ఛాన్సలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- బాధిత మహిళా ప్రొఫెసర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు



రాజేంద్రనగర్, నవంబర్ 11, (ప్రజా కలం)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపులకు గురైనట్లు ఆరోపణలు చేస్తున్న బాధిత మహిళా ప్రొఫెసర్లను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఆమెతో పాటు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కూడా బాధితులను కలిసి, వారికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, మహిళా ప్రొఫెసర్లకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్యపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టి, ఆరోపణలు నిర్ధారణ అయితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యాబోధన చేసే ఉన్నత విద్యావంతులైన మహిళా ప్రొఫెసర్లకే విశ్వవిద్యాలయాల్లో భద్రత లేకపోతే, సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు, బాధిత మహిళా ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని, వైస్ ఛాన్సలర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మహేశ్వరం డిపో మేనేజర్ కి వినతిపత్రం అందజేసిన

మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్టిసియు కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ



మహేశ్వరం, నవంబర్ 11,(ప్రజా కలం) మహేశ్వరం డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఉద్యోగులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలని కోరుతూ మహేశ్వరం డిపో మేనేజర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్టిసియూ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ సమక్షంలో మహేశ్వరం డిపో టిడబ్ల్యుయూ అధ్యక్షులు కృష్ణ గౌడ్, షరీఫ్ ఖాన్‌తో పాటు పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా అభ్యసించాలి

ఆదర్శమూర్తుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

పెద్దూరులో స్మార్ట్ తరగతి గదిని ప్రారంభించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, నవంబర్11 (ప్రజా కలం ప్రతినిధి) : విద్యార్థుల జీవితాల్లో ఉన్నతమైన మార్పునకు చదువే పునాది అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు ఎంపీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదిని కలెక్టర్ ప్రారంభించారు.

20 పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులు...

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.కోటి వ్యయంతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో తరగతి గదికి రంగులు వేయడంతోపాటు నాలుగు ఫ్యాన్లు, లైట్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, 10 డెస్కులు, యూపీఎస్ సదుపాయాలను కల్పించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ ఎంపీ హెచ్ఎన్, తారక రామనగర్ ఎంపీపీఎస్, తంగళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్, ఆర్టీసీ కాలనీ ఎంపీపీఎస్, బద్దెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట జడ్పీ ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలం లింగన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల, మల్లారెడ్డిపేట ఎంపీపీఎస్, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, బొప్పాపూర్, దుమాల ఎంపీపీఎస్, చందుర్తి మండలం మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల, సనుగుల ఎంపీపీఎస్, వేములవాడ మండలం రుద్రవరం జడ్పీ ఉన్నత పాఠశాల, వేములవాడ పట్టణ ఎంపీపీఎస్, వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి ఎంపీపీఎస్, కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎంపీపీఎస్, రుద్రంగి ఎంపీపీఎస్‌లలో ఈ సదుపాయాలు కల్పించారు.

కలెక్టర్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త హంగులు...

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తో ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో సీఎస్ఆర్ నిధుల ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగు పడుతున్నాయి. సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో యూనియన్ బ్యాంకు సహకారంతో రూ.22 లక్షల వ్యయంతో 145 పడకలు, పరుపులు ఏర్పాటు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.కోటితో 20 పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులు అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే జిల్లాలోని పలు ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సీఎస్ఆర్ నిధులతో సదుపాయాల కల్పన పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తి వికాసానికి, సమాజ అభివృద్ధికి విద్య శక్తిమంతమైన ఆయుధమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. ఇన్ఫోసిస్ ఛైర్మన్ నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి విద్యాభ్యాసం కూడా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు.వారి జీవితాల్లోని ఉన్నత విలువలు, సాధించిన విజయాలు, సమాజానికి చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పుట్టిన ప్రాంతం, మాట్లాడే భాష, కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డంకులు కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించి, ఉన్నత ఉద్యోగాలు పొందడం తోపాటు స్వయం ఉపాధి రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమని అన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు శ్రావణ్ కుమార్, నాగేశ్వరరావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్ఎం మోతిలాల్, ఏపీసీ ఛైర్‌పర్సన్ తిప్పవరం సుధ, హెచ్ఎం చక్రవర్తుల రమాదేవి, వార్డు కౌన్సిలర్లు లింగంపల్లి భాగ్యలక్ష్మి, దొంతినేని కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై మౌనం వద్దు..

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి) : మహిళల భద్రత, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సహస్ర జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, ర్యాగింగ్, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటాయని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు లేదా మానవ అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు గురైన విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి అవసరమైన రక్షణ, సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా పరిచయాలను నమ్మవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, షీ టీమ్, ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మున్సిపల్ అధికారులకు చైర్మన్ పుల్కం రాజు ఆదేశం



వేములవాడ, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి) : పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ లోకేష్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ జవాన్లతో పట్టణ పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రతిరోజూ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, మురికి కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, పారిశుధ్య సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ పరిశుభ్రత మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం స్థానిక ప్రజలకు

విద్యార్థులకు ఎంతగానో ఉపయోగం

రూ.1.50 కోట్లతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని

ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





మహేశ్వరం, నవంబర్ 11, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్, జిల్లెలగూడ 59వ డివిజన్ గాయత్రి నగర్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.50 కోట్ల ప్రత్యేక నిధులతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి గారితో కలిసి, మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు, యువతకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ గ్రంథాలయం స్థానిక ప్రజలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్ రెడ్డి గారు, మాజీ మీర్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి గారు, దీప్లాల్ చౌహన్, సిద్దాల లావణ్య బీరప్ప, అనీల్ కుమార్ యాదవ్, లాడ్స్ స్కూల్ బీరప్ప, శ్రీను నాయక్, భూపేష్ గౌడ్, విజయ్, నర్సిరెడ్డి, అర్జున్, సహదేవ్, జంగయ్య, సుదర్శన్ రెడ్డి, యాదగిరి, శివ మూర్తి, సునీతా బాల్ రాజ్, మాదరి రమేష్, సిద్దాల అంజయ్య, స్నేహ లత, మాదేవి, సూరి లత, చారి,బాల్ రాజ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డి, ఓల్డ్ గాయత్రీ నగర్ అధ్యక్షుడు ఆంజనేయులు కాలనీ వాసులు,మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పునాదులు వేసిన మహనీయుడు ఆజాద్

- ఆజాద్ జయంతి వేడుకల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి) : స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కొనియాడారు. మౌలానా ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా ఆజాద్ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యానంతరం దేశ విద్యావ్యవస్థ నిర్మాణానికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జి మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జయశ్రీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్డీ తండా గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- గ్రామ సర్పంచ్ అంగోత్ అరుణ గోపాల్ నాయక్



మహేశ్వరం, నవంబర్ 11, (ప్రజా కలం) మహేశ్వరం మండల పరిధి ఎస్డీ తండా గ్రామంలోని డీజీ తండాలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంజూరైన ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన రామవత్ సక్రి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో, నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో బుధవారం గృహప్రవేశ వేడుకలను కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంగోత్ అరుణ గోపాల్ నాయక్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు నాగేందర్ నాయక్, కేతావత్ రవి, అంగోత్ సాలి, అంగోత్ భరత్, కేతావత్ చిట్టి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారమవుతుండటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ని కలిసిన డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 11, (ప్రజా కలం) రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఆఫ్ పోలీస్



తరుణ్ జోషి, ఐపీఎస్ ని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతపై పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

కమిటీ అధ్యక్షురాలు డొక్కు అంజలి మాదిగ, అధికార ప్రతినిధి ఎర్ర మానస మాదిగ



మహేశ్వరం, నవంబర్ 11, (ప్రజా కలం)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన ఎంఎస్ఎఫ్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదిగ విద్యార్థుల చైతన్య సమావేశం నిర్వహించి నూతన ఎంఎస్ఎఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కో-ఇంచార్జ్ ఎర్ర నవీన్ కుమార్ మాదిగ మాట్లాడుతూ మాదిగ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎంఎస్ఎఫ్ వేదికగా నిలుస్తుందని, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉద్యోగ, రాజకీయ, సామాజిక తదితర అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ అధ్యక్షురాలు, డొక్కు అంజలి మాదిగ, అధికార ప్రతినిధి, ఎర్ర మానస మాదిగ, ఉపాధ్యక్షురాలు, ఆదిరాల సుస్మిత మాదిగ, ప్రధాన కార్యదర్శి,సీహెచ్. వరుణ్,కోశాధికారి, ఎన్. ప్రశాంత్ కుమార్, అధికార ప్రతినిధి,కాసగళ్ల మానస ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా కో-ఇంచార్జ్ ఎర్ర కృష్ణ మాదిగ, మహేశ్వరం మండల మాజీ అధ్యక్షులు ఎర్ర గణేష్, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు, ఎంఎస్ఎఫ్ నాయకులు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

రామసాగర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 11 : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని రామసాగర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ నరేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలోనే వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని అధిక లాభాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోచయ్య, డైరెక్టర్ ఆదిరెడ్డి,గ్రామ అధ్యక్షుడుకొందారి స్వామి, సీసీ కుమార్,వివో శైలజ, సిఏ నరేష్, వార్డు సభ్యులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ కృషి చిరస్మరణీయం

- మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్

మెదక్ (ప్రజాకలం ప్రతినిధి) దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విశేష పాత్ర పోషించడంతో పాటు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. ఆజాద్ 138 వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మెదక్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆజాద్, స్వాతంత్ర్యం అనంతరం దేశ విద్యావ్యవస్థ బలోపేతానికి విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో చైతన్యం, సమానత్వం, అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన ఆయన ఆశయాలు నేటికీ ఆచరణీయమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, మతసామరస్యం కోసం ఆజాద్ చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. భావితరా లకు నాణ్యమైన విద్య అందించ డమే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, సోహెల్, దీపక్ కుమార్, నాయకులు గడ్డమీద కృష్ణగౌడ్, లింగారెడ్డి, మాయ మల్లేశం, మోచి కిషన్, కిరణ్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సాకి చెరువు వద్ద ఛట్ సంబరం

నవంబర్ 15న జీఎంఆర్ ఆధ్వర్యంలో భారీ వేడుకలు..

రితేష్ పాండే, కావ్య సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణ..



పటాన్‌చెరు, నవంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు సాకి చెరువు వేదికగా నవంబర్ 15న ఛట్ పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర భారతీయుల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను ప్రజలకు కనువిందు చేసేలా నిర్వహించేందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రముఖ భోజ్‌పురి గాయకుడు రితేష్ పాండే,గాయని కావ్య సంగీత విభావరితో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ తీసుకురానున్నారు.

ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఛట్ పూజ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే జీఎంఆర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,గత 15 సంవత్సరాలుగా పటాన్‌చెరు వేదికగా ఛట్ పూజ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు తన సొంత నిధులతో ఉచితంగా చెరుకును వంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.నియోజకవర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతీయుల సంక్షేమానికి నిరంతరం అండగా ఉంటూ,వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలతో సమానంగా ఇతర రాష్ట్రాల ప్రజలను కూడా ఆదరిస్తూ,అందరి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నవంబర్ 15న ఆదివారం సాయంత్రం జరిగే ఛట్ పూజ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్,మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి,రాజు,సుధాకర్ గౌడ్,సంజయ్ సింగ్,టింకు తదితరులు పాల్గొన్నారు..


కాలనీలా కనీస మౌలిక సదుపాయాల ఏర్పాటుకై కృషి

-సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, నవంబర్ 11,(ప్రజా కలం) మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని గుర్రంగూడ ప్రాంతంలో టీచర్స్ కాలనీ, బృందావన్ కాలనీ, ఆదిత్య నగర్, సూర్య రియల్ ఎస్టేట్ నుంచి ఫార్చ్యూన్ కాలనీ వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నురద్దు చేయకుండా కొనసాగించి ఉంటే, ఈ పాటికే కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అన్ని మౌలిక వసతుల పనులు పూర్తయ్యేవని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గంపై రాజకీయ కక్షతో అభివృద్ధి నిధులను అడ్డుకుంటోందని, కాలనీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు శుభ కార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 11(ప్రజా కలం): సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.నూతన దాంపత్య జీవితంలోకి అడుగుపెడుతున్న వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కుమార్, జీవీ శ్రీనివాస్, కసిని శ్రీకాంత్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ ఆత్మకథ ఆధారంగా సినిమా తీస్తాను

సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలు

సోనియా గాంధీ తాను స్వయంగా రాసిన 'బిలాంగింగ్- ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం పై జగ్గారెడ్డి కీలక ప్రకటన

సినిమా నిర్మాణం పై 50 మందితో కమిటీ ఏర్పాటు చేస్తాను

సీఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా షూటింగ్ ప్రారంభింపజేస్తా

సముద్రమంత లోతున్న కాంగ్రెస్ పార్టీ రాజకీయాన్ని సోనియాగాంధీ అధ్యయనం చేశారు

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను దేశం కోసం ముందుకు నడిపిస్తున్న ఘనత సోనియమ్మ దే.





సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 11 (ప్రజా కలం):

కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ స్వయంగా రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆధారంగా ఆమె జీవితాన్ని తెలుగులో తెరకెక్కిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చిత్రానికి సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలుగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాణానికి రూ. 2 కోట్లు ఇస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ జులకంటి ఆంజనేయులు ప్రకటించారు.

50 మందితో కమిటీ....సినిమా నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేందుకు 50 మందితో కమిటీ ఏర్పాటు చేయాలని జగ్గారెడ్డి సూచించారు. ఈ కమిటీని గాంధీ భవన్ పీఆర్వో హరిప్రసాద్ పర్యవేక్షిస్తారని జగ్గారెడ్డి తెలిపారు.నాయకులు నిధులు సిద్ధం చేసుకోవాలని కోరారు. "ఎన్నికలకు ఖర్చు పెడతారు కదా. దీన్నీ అలాంటి ఖర్చుగానే అనుకోండి. బడ్జెట్ సమీకరించి, మంచి దర్శకుడిని ఎంపిక చేద్దాం" అని కార్యకర్తలతో అన్నారు. ఏర్పాట్లు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆహ్వానించి, వారి చేతుల మీదుగా షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. సోనియాగాంధీ జీవితాన్ని కార్యకర్తలు మరింత దగ్గరగా తెలుసుకునేందుకు ఆమె పుస్తక ప్రతులను తెప్పించి పంపిణీ చేస్తామన్నారు.

కుటుంబ జీవితం నుంచి రాజకీయ ప్రస్థానం వరకు....ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్‌గాంధీ భార్యగా, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలకు తల్లిగా సోనియాగాంధీ జీవితంలోని వివిధ దశలను సినిమాలో చూపిస్తామని జగ్గారెడ్డి చెప్పారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హత్యలతో కుటుంబం ఎదుర్కొన్న విషాదం, ఆ తర్వాత సోనియా ఎదుర్కొన్న కష్టాలు, రాహుల్, ప్రియాంకలను పెంచిన తీరు, ఆమె రాజకీయ ప్రస్థానాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు. ఎన్నో మతాలు, కులాలు, భాషలతో కూడిన భారతదేశంలో సోనియాగాంధీ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని చెప్పారు. "సముద్రం ఎంత లోతో, కాంగ్రెస్ రాజకీయ వ్యవస్థ అంత లోతైనది. ఆ రాజకీయాలను సోనియాగాంధీ అధ్యయనం చేశారు" అని వ్యాఖ్యానించారు. ఆమెది విజయవంతమైన రాజకీయ జీవితమని అన్నారు.

ప్రధాని పదవిని వదులుకోవడం చరిత్ర....సోనియాగాంధీకి ప్రధాని పదవిపై వ్యామోహం లేదని జగ్గారెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం పీవీ నరసింహారావు ప్రధాని అయిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, అప్పట్లో సోనియా ఆ పదవిని ఆశించలేదని చెప్పారు. యూపీఏ అధికారంలోకి వచ్చాక సోనియాగాంధీని ప్రధానిగా ఉండాలని పార్టీ నేతలు కోరినా, ఆమె ఆ పదవిని స్వీకరించకుండా మన్మోహన్‌సింగ్‌కు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రధాని అయ్యే అవకాశాన్ని ఆమె వదులుకోవడం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయమని అభిప్రాయపడ్డారు. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీల ఆలోచనల నుంచి ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని జగ్గారెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం నుంచి మళ్లీ ప్రధాని రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలనేది సోనియాగాంధీ ఆకాంక్ష అని వ్యాఖ్యానించారు.



పదవులు కాదు.. రైతుల ప్రయోజనాలే ముఖ్యం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 11.

రైతులకు మేలు జరుగుతుందంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు పదవులు ముఖ్యం కాదని, రైతుల ప్రయోజనాలు, నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నారనే కారణంతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని భావిస్తే, రైతుల కోసం రాజీనామాకు సిద్ధమేనని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దుబ్బాక నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ మండలం అనాజిపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాలువల పనులను పూర్తి చేయాలని, మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పునఃప్రారంభించాలని కోరారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో రైతులకు అన్యాయం చేయడం సరికాదని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తనపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. దమ్ముంటే అసంపూర్తి కాలువల పనులు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, ఏవో నరేష్, ఆర్ఐ రాజమల్లు, గ్రామ సర్పంచ్ సోమని నిర్మల ఇస్తారీ, సర్పంచులు నరసింహారెడ్డి, పర్వేజ్, మాసంపల్లి రాజు, మాజీ జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, ఉప సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, సంతోష్, రాజు, మండల మాజీ ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్, సత్యం, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతి నర్సింలు, రామచంద్రం గౌడ్, నాయకులు శ్రీధర్, భార్గవ్, బాలరాజు గౌడ్, బాగిరెడ్డి, రాజయ్య, ప్రసాద్ గౌడ్, మధు, బాల నర్స్, సిసి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, ఏఈఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మండల,జిల్లా పరిషత్ ఎన్నికలు

వెంటనే నిర్వహించాలి

రెండున్నరేళ్లుగా ఎన్నికలు
నిర్వహించకపోవడంతో గ్రామీణ పాలనకు విఘాతం
ఎంపీటీసీల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్,
రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవి రవీందర్

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి):

రాష్ట్రంలో మండల పరిషత్,జిల్లా పరిషత్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఎంపీటీసీల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవి రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఎన్నికలు



నిర్వహించకపోవడం వల్ల గ్రామీణ స్థానిక సంస్థల పాలనకు విఘాతం కలుగుతోందన్నారు. జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని చెప్పుకునే రేవంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.సర్పంచ్ ఎన్నికలు ఆలస్యంగా నిర్వహించడం,మున్సిపల్ ఎన్నికలు కూడా గడువు ముగిసిన తర్వాత జరపడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.4 వేల కోట్ల నిధులు నిలిచిపోయాయని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో సుమారు రూ.1,600 కోట్ల కేంద్ర నిధులు రాష్ట్రానికి అందకుండా పోయాయని తెలిపారు.గాంధీజీ,రాజీవ్ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన గురించి ప్రభుత్వం మాట్లాడుతున్నప్పటికీ,గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు.సర్పంచ్ ఎన్నికలు పూర్తయి పది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు నిధులు అందడం లేదని ఆరోపించారు.ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల పదవీకాలం ముగియగానే ఎన్నికలు నిర్వహిస్తున్నారని, తెలంగాణలో మాత్రం ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు.73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడిన పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం,గ్రామీణ, మండల,జిల్లా పరిషత్ వ్యవస్థలను నిర్లక్ష్యం చేస్తూ ఎమ్మెల్యే కేంద్రిత పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం,ఆ హామీని అమలు చేయకుండానే సర్పంచ్,మున్సిపల్ ఎన్నికలు నిర్వహించిందని పేర్కొన్నారు.ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి,నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించిన అనంతరం వెనక్కి తగ్గి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత లేకపోవడానికి నిదర్శనమన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మండల,జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాష్ట్రానికి అందేలా చర్యలు తీసుకోవాలని,గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని గడీల కుమార్ గౌడ్,దేవి రవీందర్ డిమాండ్ చేశారు.



చలో సిద్ధిపేట..

- తెలంగాణ రక్షణ సేన జిల్లా కార్యాలయానికి భూమిపూజ

- ఈ నెల 13న ఉదయం 8 గంటలకు భూమిపూజ చేయనున్న కల్వకుంట్ల కవిత

గజ్వేల్, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలి జిల్లా పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భూమిపూజ చేయనున్నట్లు ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు గజ్వేల్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఉద్యమ చరిత్రకు నిలయమైన సిద్దిపేటలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు జిల్లా పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం,సామాజిక న్యాయం లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేనను స్థాపించిన కల్వకుంట్ల కవిత ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రక్షణ సేనకు ప్రజాదరణ పెరుగుతోందని, ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని యాదగిరి అన్నారు.రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతమై అధికారంలోకి వస్తుందని, కల్వకుంట్ల కవిత తెలంగాణ తొలి మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎర్ర నర్సింలు,గజ్వేల్ నియోజకవర్గ న్యాయ విభాగం అధ్యక్షుడు నరేష్ చారి,గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు, పాషా,శ్రీనివాస్,మల్లేశం,అష్రఫ్,మున్ను, లక్ష్మణ్, మహిళా నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రభుత్వ మహిళా కళాశాలలో

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



గజ్వేల్, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారతకు విద్య ఎంతో ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు.విద్యార్థినులు కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కమల క్రిస్టియన మాట్లాడుతూ భారతదేశంలో ఆధునిక విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని తెలిపారు.ఆయన జన్మదినమైన నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఎకనామిక్స్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ బి.కస్తూరిబాయ్ మాట్లాడుతూ విద్య దేశ ఆర్థిక,శాస్త్ర,సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ డి.సుజాత మాట్లాడుతూ మహిళా సాధికారతకు విద్యే ప్రధాన మార్గమని,విద్యార్థినులు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.పాలన శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.మురళీధర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా పలు ఉద్యమాల్లో పాల్గొన్నారని, స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సుమారు పదేళ్లపాటు సేవలందించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారని వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి.శ్రీలత,జేవీఆర్ అర్చన,సీహెచ్ ఉమారాణి,ఇతర అధ్యాపకులు,కళాశాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్య , దేశ ప్రగతికి పునాది.

-ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. - ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు



సంగారెడ్డి, ప్రతినిధి నవంబర్ 11(ప్రజా కలం):

భారతదేశ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.

జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలందించారని తెలిపారు. దేశంలో ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు, యూజీసీ ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి బలమైన పునాదులు వేశారని వివరించారు. చదువుతోనే ప్రపంచాన్ని మార్చగలమని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వసించారని గుర్తుచేశారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి కూడా పునాది అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చలపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు,మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

నషా ముక్త్ భారత్ అభియాన్‌ను విస్తృతంగా నిర్వహిస్తాం
మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వెల్లడి

హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించనున్నట్లు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. ఈ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలయ్ బలయ్ ఫౌండేషన్, వీ నెట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఆంధ్ర మహిళా సభ ఉమెన్స్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం వారి భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను కేవలం ఉపన్యాసాలు, అవగాహన సదస్సులకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలు, బాధితులతో నేరుగా మాట్లాడి వారిలో మార్పు తీసుకురావాలని సూచించారు. వ్యసనానికి బానిసై చికిత్స పొందుతున్న వారిని ప్రోత్సహించేందుకు పునరావాస కేంద్రాలను సందర్శిస్తామని, వారికి అవసరమైన మార్గదర్శకత్వంతో పాటు మానసిక ధైర్యాన్ని అందిస్తామని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, ఆంధ్ర మహిళా సభ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ డి. చక్రపాణి, ప్రొఫెసర్ మురళీ మనోహర్, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రముఖ వక్త ఆకెళ్ల రాఘవేంద్ర, సందీప్, విశ్వనాథ్, వీ నెట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తి..

విద్యార్థినికి ఆర్థిక చేయూత

గజ్వేల్ నియోజకవర్గం, నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి)

పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా,ఆ ఆనందాన్ని ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వినియోగిస్తూ అన్నవెల్లి సౌజన్య--మల్లికార్జున్ దంపతులు ఆదర్శంగా నిలుస్తున్నారు.తమ కుమారుడు వైశాంత్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రతిభావంతులైన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్న ఈ దంపతులు, అదే సేవా స్ఫూర్తిని ఈ ఏడాది కూడా కొనసాగించారు.వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన ఓ ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు ఆటంకం కలగకుండా, ఆమె ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించారు. పుట్టినరోజు వేడుకను ఓ విద్యార్థిని భవిష్యత్తుకు భరోసాగా మార్చడం పలువురి ప్రశంసలు అందుకుంది.ఈ కార్యక్రమంలో బారు అరవింద్, మంతూరి నాగరాజు గౌడ్, ప్రశాంత్ రాచకొండ, బబ్బూరి రవీందర్ గౌడ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం,పలువురు పాల్గొని దంపతులను అభినందించారు.



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాయపోల్ విద్యార్థుల ఎంపిక.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 11.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాయపోల్ పాఠశాల విద్యార్థులు రిషి, సౌమ్య ఎంపికయ్యారు. ఇటీవల ఈ నెల 2న సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రీడల్లో ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ నెల 13 నుంచి 15 వరకు సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో నిర్వహించనున్న 70వ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) వాలీబాల్ పోటీల్లో రిషి, సౌమ్య పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పీడీ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేసి, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అధునాతన వెన్నెముక శస్త్రచికిత్సలో కిమ్స్ ఎరీట్‌కు అరుదైన గుర్తింపు

అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' హోదా

దేశంలోనే తొలిసారిగా గుర్తింపు.. డాక్టర్ సుకుమార్ సురా నేతృత్వంలో ఘనత

హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

అధునాతన వెన్నెముక శస్త్రచికిత్సా వైద్య సేవల్లో హైదరాబాద్‌లోని కిమ్స్ ఎరీట్ ఆసుపత్రి అరుదైన ఘనత సాధించింది. ఆసుపత్రిలోని స్పైన్ ఇన్‌స్టిట్యూట్‌కు జర్మనీకి చెందిన ప్రముఖ వైద్య సాంకేతిక సంస్థ రీవోస్పైన్ 'ఫుల్ ఎండోస్కోపిక్ అడ్వాన్స్‌డ్ స్పైన్ సర్జరీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తింపునిచ్చింది. భారతదేశంలో ఈ విభాగంలో తొలిసారిగా ఈ గుర్తింపు లభించడం విశేషం. స్పైన్ సర్జరీ విభాగంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్, క్లినికల్ డైరెక్టర్, విభాగాధిపతి, జాతీయ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ విభాగం నాయకుడు డాక్టర్ సుకుమార్ సురా నేతృత్వంలో గత 13 ఏళ్లకు పైగా అందిస్తున్న విశిష్ట వైద్య సేవలకు ఈ గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. భాస్కర్‌రావు మాట్లాడుతూ.. వైద్యరంగం అత్యాధునిక శస్త్రచికిత్సా విధానాల దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వైద్య సాంకేతికతతో పాటు వైద్యుల అనుభవం, నైపుణ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. సరైన శిక్షణ, వైద్య అనుభవం, రోగుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అత్యాధునిక వైద్య విధానాలను బాధ్యతాయుతంగా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. డాక్టర్ సుకుమార్ సురా మాట్లాడుతూ.. ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ విధానం కాలక్రమేణా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. శస్త్రచికిత్సలో చిన్న గాటు పెట్టడం ఒక్కటే కాకుండా, సరైన రోగిని ఎంపిక చేసి తగిన చికిత్సా విధానాన్ని అనుసరించడం అత్యంత ముఖ్యమని వివరించారు. రీవోస్పైన్ సంస్థ అందించిన గుర్తింపు తమ స్పైన్ ఇన్‌స్టిట్యూట్‌కు కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఈ విభాగంలో అత్యున్నత వైద్య ప్రమాణాలను కొనసాగించేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. రీవోస్పైన్ సంస్థ జర్మనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డిర్క్ గోథెల్, అంతర్జాతీయ విక్రయాల డైరెక్టర్ లెనా గోథెల్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఎండోస్కోపిక్ వెన్నెముక శస్త్రచికిత్సకు అత్యాధునిక సాంకేతికత ఒక్కటే సరిపోదని, సరైన శిక్షణ, అనుభవం, రోగుల పట్ల క్రమబద్ధమైన వైద్య విధానం అవసరమని తెలిపారు. ఈ ప్రమాణాలను పాటిస్తున్న కిమ్స్ ఎరీట్ స్పైన్ ఇన్‌స్టిట్యూట్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



బాచుపల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన బిక్ష ప్రారంభం

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

అయ్యప్ప స్వాముల సేవే లక్ష్యంగా బాచుపల్లి శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో మొదటి రోజు అన్నదాన బిక్ష కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్నిధానంలో అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నదాన బిక్షను ప్రారంభించి అయ్యప్ప స్వాములకు న్వయంగా భోజనం వడ్డించారు. అయ్యప్ప దీక్ష కొనసాగించే కాలమంతా ప్రతిరోజూ స్వాములకు మధ్యాహ్న బిక్ష అందించాలనే సంకల్పంతో ఆగం పాండు ముదిరాజ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈకార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ, అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు సన్నిధానంలో ఆశ్రయం కల్పిస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. ఆగం పాండు ముదిరాజ్ చేస్తున్న ఈ సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.



తండ్రి బాటలో తనయుడు..

తండ్రి అడుగుజాడల్లో తనయుడు అన్నట్లుగా ఆగం పాండు ముదిరాజ్ కుమారుడు ఆగం కిరణ్ కుమార్ ఈ ఏడాది తొలిసారిగా అయ్యప్ప మాలధారణ చేసి కన్యాస్వామిగా దీక్షను ప్రారంభించారు. భక్తి, సేవాభావంతో కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాముల సేవలో భాగస్వాములు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప స్వాముల దీక్షా కాలమంతా ఈ సన్నిధానంలో అన్నదాన బిక్ష కార్యక్రమం కొనసాగనుండటంతో స్వాములు హర్షం వ్యక్తం చేశారు.

మీసాల సుదర్శన్‌పై ఆరోపణలు అవాస్తవం

రెండోసారి చైర్మన్ కాకూడదనే ఉద్దేశంతోనే అసత్య ప్రచారం



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 11: నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని అయిలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్‌పై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రైతులు ఖండించారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశం నిర్వహించి చైర్మన్‌కు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మీసాల సుదర్శన్ రెండోసారి చైర్మన్ కాకూడదనే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు కావాలనే అనత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన గతంలో పలు పదవులు చేపట్టి రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు సమయంలో రైస్ మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు కలగకుండా చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. సుదర్శన్ చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ. 1.26 కోట్ల వ్యయంతో 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన నూతన గోదాంను నిర్మించారని, దాని ద్వారా సొసైటీకి నెలకు సుమారు రూ. లక్ష అద్దె ఆదాయం సమకూరుతోందని వివరించారు. అలాగే రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు ఐదు ఎకరాల స్థలాన్ని చదును చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. సొసైటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తిపై వ్యక్తిగత స్వార్థంతో ఆరోపణలు చేయడం సరికాదని, వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో అనత్య ప్రచారాలు చేయవద్దని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 138వ జయంతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 11: భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, విద్యా రంగ పితామహుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ముస్లిం, దళిత బహుజన సంఘాల నాయకులు అత్యంత బ్రహ్మాండంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆజాద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముస్లిం మరియు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ, స్వతంత్ర భారతదేశంలో విద్యా రంగానికి బలమైన పునాది వేసిన మహనీయుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా ఉన్న కాలంలో స్థాపించిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలే నేటికీ దేశ విద్యా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయని గుర్తుచేశారు. దేశంలో ముస్లింలు, దళితులు, సబ్బండ కులాల అందరికీ విద్య, వసతి గృహాలు (హాస్టల్స్) ఊరూరా బడులు అందుబాటులోకి రావడానికి ఆనాడే రూపుకల్పన జరిగిందని పేర్కొన్నారు. ఆనాడు ఎంతో చౌకగా, సామాన్యుడికి అందుబాటులో ఉన్న విద్య.. నేడు పూర్తిగా వ్యాపారీకరణ చెందడంపై నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాధారణ మానవుడు నాణ్యమైన చదువు చదువుకోవడానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.భారతదేశంలో ప్రస్తుత పార్లమెంట్ మరియు రాజకీయ గమనాన్ని దృష్టిలో ఉంచుకుని, ముస్లింలు, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉన్నత విద్యను అందించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆజాద్ ఆశయాల స్ఫూర్తితో అణగారిన వర్గాల ఉన్నతి కోసం విద్యా హక్కులను కాపాడుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, దళిత సంక్షేమ సంఘం నాయకులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశం



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 11: ఆర్మూర్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసులు, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై సమీక్షించారు. నవంబర్ 25 నుంచి 28 వరకు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, పేకాట, గుట్కా వంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం దాడులు నిర్వహించాలని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు డయల్ 112 అత్యవసర సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ గురునాయుడు, ఇన్స్పెక్టర్లు, సిఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కథల పోటీలో అంభం విద్యార్థినికి తృతీయ బహుమతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 11: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం అంభం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని జీడి శరణ్య రాష్ట్రస్థాయి కథల పోటీలో తృతీయ బహుమతి సాధించి ప్రతిభ చాటింది. తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్స వం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల సాంస్కృతికోత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 1,450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో శరణ్య రచించిన 'ప్రాణం పోసిన రక్తదానం' కథకు తృతీయ బహుమతి లభించింది. తెలుగు ఉపాధ్యా యుడు, గైడ్ టీచర్ బొడ్డు భరద్వాజ మార్గదర్శ కత్వంలో ఆమె ఈ విజయాన్ని సాధించింది. విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల తరఫున అభినందించారు. శరణ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



HMT రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

:మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) హెచ్.ఎం.టీ సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులు బుధవారం హైదరాబాద్‌లోని హెచ్ఎంటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హెచ్ఎంటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక బిజెపి నాయకుడు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి, పార్లమెంట్‌లో ప్రస్తావించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. హెచ్ఎంటీకి చెందిన భూములు అన్యాక్రాంతమవుతూ, కబ్జాలకు గురవుతున్నాయని, సంస్థ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత హెచ్ఎంటీ యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు. ఈనిరసన కార్యక్రమంలో హెచ్ఎంటీ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ సభ్యులు జీవి నారాయణరెడ్డి, రాములు, మధు కృష్ణ, రవీందర్, యాదగిరి, కుమార స్వామి, మహేందర్, మాల్యాద్రి మరియు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

నవంబర్ నెలాఖరులోగా తొలి విడత రీసర్వే పూర్తి చేయాలి



సిద్దిపేట,
నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి):

రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ రీసర్వే పురోగతిపై సమీక్షించారు.

నవంబర్ నెలాఖరులోగా తొలి విడత పూర్తి

రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ని పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నివేదికలు రూపొందించాలని తెలిపారు.నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతకు ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడిం చారు.రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇందుకోసం ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసి,లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు.

రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి

రీసర్వే నిర్వహించే గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, వారి సమక్షంలోనే సర్వే చేపట్టాలని సూచించారు. రైతులకు నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన అవగాహన కల్పించాలని తెలిపారు. సర్వే నివేదికలపై అభ్యంతరాలు ఎక్కడ, ఎలా సమర్పించాలి,వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారనే విషయాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు వివరాలు తెలియజేయాలని, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్న నేపథ్యంలో భూ రికార్డుల్లో కచ్చితత్వం ఉండేలా చూడాలని తెలిపారు.

అసైన్డ్ భూములపై ప్రత్యేక పరిశీలన

అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు అసలైనవా,నకిలీవా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్నారా లేదా,పట్టాలోని విస్తీర్ణానికి క్షేత్రస్థాయి భూమి విస్తీర్ణానికి తేడాలు ఉన్నాయా అనే విషయాలను నిర్ధారించాలని సూచించారు. చెరువులు,కుంటలు, రహదారులు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో సేకరించిన భూములకు సంబంధించిన సర్వే నంబర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

రీసర్వేలో అధికారులు ఎవరైనా అక్రమాలకు,అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు.భవిష్యత్తులో ప్రజలకు భూ వివాదాలు తలెత్తకుండా రీసర్వేను నాణ్యతతో,పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుంచి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్,ఆర్డీఓలు సదానందం, రామ్మూర్తి,ఏడీ సర్వే అండ్ ల్యాండ్స్ సుదర్శన్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలివచ్చిన ముంబై తెలంగాణ ఉద్యమకారులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 11:

ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటీజేఏసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సభకు ముంబై నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు బయలుదేరారు. ముంబై, భివండి, నవీముంబై, సూరత్ ప్రాంతాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులతో ఈ సభను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు సభ జరగనుంది. ఈ కార్యక్రమానికి కేకే కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, శోభన్ రెడ్డి, రాములు నాయక్, అద్దంకి దయాకర్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఎంటీజేఏసీ కన్వీనర్ సిరిపంగి రవీందర్ చొరవతో చేపట్టిన ఈ చలో హైదరాబాద్ కార్యక్రమంలో సిరిపంగి రవీందర్, బోయ మల్లేష్, ముత్యాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ ద్వారా తెలంగాణ ఉద్యమకారులకు సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ సంగీత పోటీలకు గజ్వేల్ ఉపాధ్యాయుడి ఎంపిక

- రాష్ట్రస్థాయి కర్ణాటక శాస్త్రీయ సంగీత పోటీల్లో ప్రథమ స్థానం



గజ్వేల్,నవంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పాఠశాలకు చెందిన తెలుగు భాషా ఉపాధ్యాయుడు ఆర్. కోదండరామ శర్మ జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ సంగీత పోటీలకు ఎంపికయ్యారు.హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళావేదికలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెన్ రాష్ట్రస్థాయి సంగీతం, నృత్యం,వాద్య సంగీతం,నాటక పోటీల్లో ఆయన కర్ణాటక శాస్త్రీయ సంగీతం (లలిత సంగీతం) గాత్ర విభాగంలో పాల్గొన్నారు.ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి, ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ సంగీత పోటీలకు అర్హత సాధించారు.కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఈ సందర్భంగా కోదండరామ శర్మ తెలిపారు. భవిష్యత్తులో తాను నేర్చుకున్న సంగీత కళను పాఠశాల విద్యార్థులతో పాటు ఆసక్తి కలిగిన సంగీత ప్రియులకు నేర్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి కోదండరామ శర్మకు అభినందనలు తెలిపారు.

గాంధీనగర్ బస్తీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు శ్రీకారం

హైదరాబాద్, నవంబరు 11 (ప్రజాకలం) :

శాలివాహన డివిజన్ పరిధిలోని గాంధీనగర్ బస్తీలో రూ.8 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నా వెంకట రమణ హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన డివిజన్ మాజీ అధ్యక్షుడు ముకేష్ సూర్యవంశీ, ఉదయ్ కిరణ్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి, గాంధీనగర్ బస్తీ అధ్యక్షుడు సాగర్, బస్తీ ప్రధాన కార్యదర్శి రాజుతో పాటు పలువురు స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.




దళితుల భూములను తిరిగి

స్వాధీనం చేసుకుంటాం

కేసీఆర్, కేటీఆర్ సహా మాజీ మంత్రుల భూములపై డాక్టర్ పిడమర్తి రవి సంచలన వ్యాఖ్యలు

నవంబర్ 29న కార్తీక మాస వనభోజనాలు.. పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహణ



హైదరాబాద్
నవంబర్ 11(ప్రజాకలం ప్రతినిధి):

తెలంగాణలో దళితులకు చెందిన ఇనాం, అసైన్డ్ భూములను అక్రమంగా కబ్జా చేసిన వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డిలు దళితుల భూములను అక్రమంగా కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. దళితుల భూములను సర్వే చేసి నెల రోజుల్లోగా తిరిగి అప్పగిస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళితుల భూములను గుర్తించి, వాటిని అనలైన హక్కుదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని అన్ని దళిత సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఆయా భూముల వద్దకు వెళ్లి తమ భూములను తామే స్వాధీనం చేసుకుని వంచుకుంటామని హెచ్చరించారు.

నవంబర్ 29న కార్తీక మాస వనభోజనాలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబర్ 29న హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ పిడమర్తి రవి వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మాదిగ ఉపకులాలకు చెందిన కవులు, కళాకారులు, విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దె యాదయ్య, నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు భూదాల బాబురావు, దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల మల్లికార్జున్, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జెర్రిపోతుల సాయన్న, దేవరకొండ నరేష్, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జోగు గణేష్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దు..

మంచి అభిరుచులను పెంచుకోండి

పోలీస్ సిబ్బందికి హైదరాబాద్ సీపీ సజ్జనర్ సూచన

కానిస్టేబుల్ నారాయణరావు 'వంశధార' పుస్తకావిష్కరణ



హైదరాబాద్
నవంబర్ 11(ప్రజాకలం ప్రతినిధి):

పోలీస్ సిబ్బంది చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా, మానసిక ప్రశాంతత కోసం ఏదో ఒక సృజనాత్మక అభిరుచిని అలవర్చుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ సూచించారు. బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను గుర్తించి క్రీడలు, పుస్తక పఠనం, సంగీతం,యోగా, రచనలు వంటి మంచి అభిరుచులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో బుధవారం హైదరాబాద్ సిటీ పోలీస్ ఐటీ సెల్ కానిస్టేబుల్ నారాయణరావు కురిటి రచించిన 'వంశధార' వచన కవితా సంకలనాన్ని నగర సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన కానిస్టేబుల్ నారాయణరావు, నిరంతరం బిజీగా ఉండే పోలీస్ ఉద్యోగంలో ఉంటూనే నాలుగేళ్ల పాటు శ్రమించి ఇంత చక్కటి పుస్తకాన్ని తీసుకురావడం సిటీ పోలీస్‌కు గర్వకారణమని ప్రశంసించారు. విధులకు ఆటంకం కలగకుండా ప్రతి ఒక్క సిబ్బంది తమ ఖాళీ సమయాన్ని ఇలాంటి మంచి పనులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. 'వంశధార' పుస్తకాన్ని రచయిత నారాయణరావు తన తల్లిదండ్రులు రమణ-నర్సమ్మలకు అంకితం ఇవ్వడంపై సీపీ స్పందిస్తూ.. కంటికి కనిపించే దేవుళ్లయిన తల్లిదండ్రులను గౌరవించడం, చూసుకోవడం ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యమన్నారు. పోలీసులు నిశ్చింతగా విధులు నిర్వర్తిస్తున్నారంటే ఇంట్లో ఉండి సర్వం చూసుకునే వారి భార్యలు,కుటుంబ సభ్యుల సహకారమే కారణమని కొనియాడారు.

ఏఐ విస్తరిస్తున్న ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత పెరిగినా.. మానవ భావోద్వేగాలను, అక్షరానికి ఉండే జీవాన్ని ఏఐ ఎప్పటికీ భర్తీ చేయలేదని, పుస్తక పఠనం, రచన ఎప్పటికీ శాశ్వతంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత తల్లిదండ్రులు రమణ-నర్సమ్మ, సతీమణి గీతాంజలిలతో పాటు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, యూపీఎస్సీ మెంటార్ ఎస్. రాజ్ కుమార్, లిమ్కా బుక్ అవార్డు గ్రహీత రామ కోటేశ్వరరావు, డీసీపీ వెంకటలక్ష్మి, ప్రచురణకర్తలు 'ఆన్వీక్షికి' వెంకట్ సిద్ధారెడ్డి, మహీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వంశధార నది సాంస్కృతిక జీవనం, సైనికుల కుటుంబాల త్యాగాలు, పోలీసింగ్ అనుభవాలతో కూడిన ఈ కవితా సంకలనం సాహితీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుందని వక్తలు అభినందించారు.


అధికారుల్లో సమన్వయ లోపం..

- అంబర్‌పేట్ బఫర్ జోన్‌లో ఆగని కబ్జాల పర్వం!

- ఇరిగేషన్ అధికారులు 'బఫర్ జోన్' అంటుంటే.. రెవెన్యూ అధికారులు 'పట్టా భూమి' అంటున్నారు!

- విషయం ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం...
- ఎమ్మార్వోకు వేరే పనులు ఉండవా అంటూ నిర్లక్ష్యపు సమాధానం...
- సందట్లో సడేమియా అన్నట్లు రెచ్చిపోతున్న కబ్జాకోరులు
- కలెక్టర్ గారూ మీరైనా స్పందించండి





హైదరాబాద్ నవంబర్ 11(ప్రజాకలం ప్రతినిధి)

ప్రభుత్వ భూములు,చెరువులు, నాలాల బఫర్ జోన్లను కాపాడాల్సిన అధికారుల మధ్య సమన్వయ లోపం కబ్జాకోరులకు వరంగా మారింది. అంబర్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతం లోని బఫర్ జోన్ లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.క్షేత్రస్థాయిలో ఇరిగేషన్,రెవెన్యూ శాఖల అధికారుల పరస్పర విరుద్ధ ప్రకటనలతో సామాన్యులు అయోమయానికి గురవుతుండగా, అక్రమార్కులు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం:

అంబర్‌పేట్ పరిధిలోని కీలక మూసీ బఫర్ జోన్ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు లారీలకొద్ది మట్టిని నింపి చదును చేస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి పూర్తిగా బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని, అక్కడ మట్టి పోసి చదును చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు.రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే,ఇదే విషయంపై రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే మాత్రం భిన్నమైన సమాధానం వస్తోంది. అది బఫర్ జోన్ కాదని, ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన పట్టా భూమి అంటూ రెవెన్యూ సిబ్బంది కబ్జాకోరులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినా నిరాశే!

రెండు శాఖల అధికారుల తీరు బిన్నంగా ఉండడంతో ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులైన ఆర్డీఓ దృష్టికి ప్రజాకలం ప్రతినిధి తీసుకెళ్లి కబ్జాలను అడ్డుకుని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని విన్నవించారు.అయితే ఈ సమస్యను పరిష్కరించాల్సిన ఆర్డీఓ కార్యాలయం నుంచి కూడా నిర్లక్ష్యపు సమాధానమే ఎదురైంది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన ఎమ్మార్వో కు వేరే పనులు ఉండవా? అంటూ బాధ్యతారహితంగా సమాధానం ఇవ్వడం చూస్తే కబ్జాకోరులకు సహకరించినట్లు అర్థమవుతుంది.

కలెక్టర్ గారూ మీరైనా స్పందించండి

ఇరిగేషన్,రెవెన్యూ అధికారుల మధ్య ఉన్న ఈ సమన్వయ లోపాన్ని కబ్జాకోరులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. 'సందట్లో సడేమియా' అన్నట్లుగా లారీలకొద్ది మట్టిని డంప్ చేస్తూ జేసిబీలు,ఇటాచీలతో చదును చేస్తూ మూసీ బఫర్ స్థలాలను ఆక్రమిస్తున్నారు.కిందిస్థాయి నుంచి ఆర్డీఓ స్థాయి వరకు అధికారులు చేతులెత్తేయడంతో, ఇక జిల్లా కలెక్టర్ గారే స్వయంగా జోక్యం చేసుకోవాలని అంబర్‌పేట్ ప్రజలు కోరుతున్నారు.జకలెక్టర్ గారు ఒకసారి ఈ ప్రాంతాన్ని పరిశీలించి, సమగ్ర సర్వే నిర్వహించి బఫర్ జోన్ కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బీరంగూడకు మహర్దశ!

- బీరంగూడ అభివృద్ధికి కాటా ప్రత్యేక చొరవ..

- మంత్రి, ఎంపీ, జోనల్ కమిషనర్‌కు వినతులు..

- పెండింగ్ పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి..

పటాన్‌చెరు, నవంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్ రూపురేఖలు మార్చేందుకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ కీలక అడుగు వేశారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.ఆయన సూచనల మేరకు అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి నేరుగా ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి డివిజన్ అభివృద్ధిపై వినతులు సమర్పించారు.సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్లను కలిసిన శశిధర్ రెడ్డి,బీరంగూడలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు,పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, తక్షణ చర్యలు చేపట్టాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు.అనంతరం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,కాటా శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో బీరంగూడ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దండు రమేష్ యాదవ్, మన్నె రవీందర్, మహేష్ గౌడ్ పాల్గొన్నారు..





చెరకు టన్నుకు రూ.4,500 మద్దతు ధర కల్పించాలి

చెరకు శాఖ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్



జహీరాబాద్ నవంబర్ 11(ప్రజాకలం ప్రతినిధి):

నియోజకవర్గంలోని చెరకు రైతుల సమస్యలను పరిష్కరించి, వారి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర చెరకు శాఖ కమిషనర్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో సుమారు 49,592 ఎకరాల్లో చెరకు సాగు జరుగుతోందని, ఏటా 12,39,800 మెట్రిక్ టన్నుల చెరకు ఉత్పత్తి అవుతోందని తెలిపారు. అయితే గత మూడేళ్లుగా స్థానిక చక్కెర కర్మాగారం మూతపడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పండించిన చెరకును కోత కోయించి విక్రయించుకోవడంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సరైన ధర లభించక ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరకు రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని టన్నుకు రూ. 4,500 మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

కేసు కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో జగన్ పిటిషన్

అమరావతి : వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. పులివెందులలో తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని (క్వాష్) కోరుతూ ఆయన న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున పులివెందుల మున్సిపల్ కార్యాలయం ఎదుట జగన్ నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి అనుమతించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో ఆయన అక్కడ ధర్నా చేపట్టారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లో ఉన్న సమయంలో అనుమతి లేకుండా ఆందోళన నిర్వహించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో జగన్‌తో పాటు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, సుమారు 70 మందిపై నిబంధనల ఉల్లంఘన కింద అభియోగాలు మోపారు. రాజకీయ కారణాలతోనే ఈ కేసు నమోదు చేశారని, అందువల్ల దీనిని కొట్టివేయాలని జగన్ తన పిటిషన్‌లో కోరారు. మరోవైపు, వైసీపీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు కూడా హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయం వద్ద నిరసన తెలిపినందుకు గాను ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మురుగుడు హనుమంతరావు, రుహుల్లాలపై సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తమపై పెట్టిన కేసును కూడా కొట్టివేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. జగన్ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్సీల పిటిషన్లపై ఏపీ హైకోర్టు విచారణ చేపట్టనుంది.

అద్దెకు ఉంటూ.. యజమాని ఇంట్లోనే చోరీ

నిందితుడి అరెస్ట్.. రూ.3 లక్షల విలువైన 55.200 గ్రాముల బంగారం స్వాధీనం

గుంటూరు: అద్దెకు ఉంటున్న ఇంటి యజమానుల ఇంట్లోనే చోరీకి పాల్పడిన నిందితుడిని లాలాపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ టి.సీతారాం తెలిపారు. అహ్మద్ నగర్‌లో జరిగిన గృహ దొంగతనం కేసులో నిందితుడు షేక్ మహమ్మద్ రఫీ (28)ను రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి రూ. 3 లక్షల విలువైన 55. 200 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబం వైద్య చికిత్స కోసం విశాఖపట్నం వెళ్లిన సమయంలో నిందితుడు ఇంటి తాళాలు పగలగొట్టి సుమారు 153 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ. 5 వేల నగదు అపహరించినట్లు డీఎస్పీ వివరించారు. సాంకేతిక నిఘా, వేలిముద్రల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన సొత్తు రికవరీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ సూచనల మేరకు తన పర్యవేక్షణలో లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్ఐ వెంకటరావు, హెచ్‌సీ ఎం.కల్యాణ్, పోలీసు సిబ్బంది కిరణ్ కుమార్, పి.శంకర్ సమన్వయంతో కేసును ఛేదించినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

రాజకీయ నేతల వ్యక్తిగత వ్యవహారాలపై స్పందించవద్దు

అమరావతి : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారానికి సంబంధించి సంయమనం పాటించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తమ శ్రేణులను ఆదేశించింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై పార్టీ నాయకులు, అధికార ప్రతినిధులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ఎవరూ స్పందించవద్దని స్పష్టం చేస్తూ వైసీపీ ఒక అధికారిక ప్రకటన జారీ చేసింది. వ్యక్తుల ప్రైవసీని గౌరవించాలని, బహిరంగ వేదికలపై కమ్యూనికేట్ చేసేటప్పుడు విచక్షణతో మెలగాలని పార్టీ కోరింది. రాజకీయ నేతల వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి బహిరంగ వ్యాఖ్యలు గానీ, ప్రకటనలు గానీ చేయకూడదు. సోషల్ మీడియా వేదికలపై ఇలాంటి చర్చల్లో పాల్గొనడం గానీ, సంబంధిత పోస్టులకు కామెంట్లు/రిప్లైలు ఇవ్వడం గానీ చేయవద్దు.ఏ వ్యక్తిగత విషయాలకు సంబంధించిన సమాచారాన్ని లేదా కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయడం, సర్కులేట్ చేయడం చేయరాదని సూచించారు.పబ్లిక్ ప్లాట్‌ఫామ్స్‌పై ఎల్లప్పుడూ హుందాగా, అత్యంత బాధ్యతాయుతమైన విధానాన్ని అవలంబించాలి.

వివాహేతర సంబంధం చూశాడని..

ప్రియుడితో కలిసి బాలుడ్ని చంపిన మహిళ

ఖమ్మం : తన వివాహేతర సంబంధం చూశాడని ఒక మహిళ తన ప్రియుడితో కలిసి బాలుడ్ని చంపేసింది. ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం, చిన్నకొరుకొండలో ఘటన జరిగింది. నిందితురాలు అపర్ణ భర్తతో విడిపోయి తన అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలోనే.. అదే గ్రామానికి చెందిన అజయ్‌తో అపర్ణకు వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరిద్దరు ఏకాంతంగా ఉన్నప్పుడు రవి (15) చూసాడు. కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్తానని హెచ్చరించడంతో అపర్ణ అతని హత్యకు కుట్ర పన్నింది. గత నెల 24వ తేదీన మాయమాటలు చెప్పి రవిని ఊరి బయటకు తీసుకెళ్లింది. అక్కడ కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి.. అతనితో తాగించారు నిందితులు. దాంతో రవి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గత నెల 25న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రవి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. అపర్ణ, అజయ్ కలిసి చంపినట్టు తేల్చారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.

వ్యవసాయ విశ్వద్యాలయంలో ఉద్రిక్తత

రంగారెడ్డి : రాజేంద్రనగర్లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద ఉదయం ఉద్రిక్తత నెలకొంది.మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ పి. కార్తీక్ రెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో పోలీసులు కుడా మోహరించారు. బీఆర్ఎస్ నేతలు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో.. ఈ అంశంపై మీడియాతో మాట్లాడటంతో పాటు, యూనివర్సిటీలోని మహిళా అధికారులు, ఉద్యోగులతో వారు చర్చించనున్నారు. అయితే బీఆర్ఎస్ నేతల పర్యటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. యూనివర్సిటీలోకి వెళ్లే అన్ని మార్గాల్లో భారీగా పోలీసులను మోహరించి.. ముందస్తుగా పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

బిర్యానీ సెంటర్లో వ్యక్తి పై కత్తితో దాడి

రంగారెడ్డి : బీ ఎన్ రెడ్డ నగర్ లోని అతిధి బిర్యానీ సెంటర్లో జరిగిన ఘర్షణ లో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. బిర్యానీ ఆలస్యమైందని గొడవ మొదలయింది. హోటల్ యాజమాన్యం అనుచరులు కత్తితో విరుచుకుపడ్డారు. బిర్యాని తినడానికి వచ్చిన మిధాని కాలనీకి చెందిన రమేష్ గౌడ్, మల్లేష్, శివ, రాకేష్లపై దాడి జరిగింది. బాధితుడు మల్లేష్ కనుబొమ్మ, వీపు భాగంలో తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. బీరు బాటిళ్లతో బెదిరింపులు చేస్తూ చంపేస్తామంటూ బెదిరించారని బాధితులు ఆరోపించారు. దాడి సమయంలో 25 వేల నగదు, ఫోన్లు మాయమయ్యాయని అన్నారు. వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గాయపడిన వారికి చికిత్స జరిపించారు.బాధితుడి ఫిర్యాదుతో పోలీసుఎలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

ఆత్మకూరు : విద్యార్థినీ విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ శక్తి యాప్ అవగాహన బృందం సిబ్బంది సూచించారు. ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ ఉత్తర్వులతో, ఆత్మకూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో ఉన్న ఎంపీపీఎస్ యూబీ మోడల్ ప్రైమరీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పామూలపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, మహిళా హోంగార్డు సుప్రియ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అపరిచితులు లేదా తెలిసిన వ్యక్తులు మాయమాటలు చెప్పి ఎక్కడికైనా తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే వెళ్లకూడదని, ఎవరైనా ఇచ్చే ఆహార పదార్థాలను తీసుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని తెలిపారు.

5జీ, డ్రోన్ టెక్నాలజీపై గీతం ప్రత్యేక శిక్షణ

గీతంలో మూడు రోజుల పాటు నిపుణులతో కార్యశాల నిర్వహణ

ఆధునిక సాంకేతికతలు, పరిశోధనలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన

పటాన్‌చెరు, నవంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

5జీ కమ్యూనికేషన్,డ్రోన్ సాంకేతికతల్లో వస్తున్న ఆధునిక మార్పులపై విద్యార్థులు, అధ్యాపకులు,పరిశోధకులకు అవగాహన కల్పించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మూడు రోజుల ప్రత్యేక కార్యశాలను నిర్వహించింది. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు పాల్గొని ఆధునిక సాంకేతికతలపై శిక్షణ అందించారు.విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యశాలలో 5జీ సమాచార వ్యవస్థలు,డ్రోన్ల పనితీరు,కృత్రిమ మేధస్సు, స్వయంచాలక దిశానిర్దేశం, సమాచార ప్రసార విధానాలపై వివరించారు.ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా ఆచరణాత్మక అవగాహన కల్పించారు.స్మార్ట్ వ్యవసాయం,నగరాల అభివృద్ధి, విపత్తుల నిర్వహణలో వీటి వినియోగంపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఐఐటీడీఎంకు చెందిన డాక్టర్ ఎం.రవి కుమార్, డాక్టర్ పి. కిషోర్,డాక్టర్ కె. కృష్ణ నాయక్,ఖరగ్‌పూర్ ఐఐటీకి చెందిన డాక్టర్ కె. జగదీష్, డాక్టర్ అజిత్ కుమార్,డాక్టర్



రవిరాజ్ సక్సేనా,డాక్టర్ సిమ్రన్ జిత్ సింగ్, డాక్టర్ ఎన్.వి.ఆర్. స్వరూప్ కుమార్,డాక్టర్ కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని నిపుణుల సూచనలు అందించారు.మూడు రోజుల కార్యశాలలో పలువురు విద్యార్థులు,అధ్యాపకులు, పరిశోధకులు చురుగ్గా పాల్గొని సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరుచుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు ఎంతగానో దోహదపడతాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు..

అయ్యప్ప ఆలయానికి మహోత్సవ కళ..

నియమ నిష్ఠలకు ప్రతీక అయ్యప్ప దీక్ష.. భక్తి పారవశ్యంలో మాలధారులు..

ఈ నెల 22న విగ్రహ ప్రతిష్ట.. ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి..



పటాన్‌చెరు, నవంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

భక్తి, క్రమశిక్షణ, నియమ నిష్ఠలు, ఆత్మశుద్ధికి ప్రతీక అయ్యప్ప స్వామి దీక్ష. మండల కాలం పాటు కఠిన నియమాలు పాటిస్తూ,నల్లని వస్త్రాలు ధరించి, స్వామియే శరణమయ్యప్ప అంటూ నిత్యం నామస్మరణ చేసే అయ్యప్ప మాలధారుల భక్తి భావం, ఆధ్యాత్మిక చింతన ఎంతో గొప్పవి.కులమతాలకు అతీతంగా సమానత్వం, సోదరభావం, సేవాతత్పరతను చాటుతూ స్వామి శరణుఘోషతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపే అయ్యప్ప భక్తుల కోసం బీరంగూడలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవస్థానం భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవనుంది. బీరంగూడ డివిజన్ పరిధిలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 22న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.ఈ సందర్భంగా బుధవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ కొల్లూరి మల్లేష్,మాజీ ఎంపీటీసీ అనిల్, కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు..

సదర్ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ

రామచంద్రపురంలో అట్టహాసంగా యాదవుల సదర్ ఉత్సవాలు..

ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి..

దున్నపోతుల ప్రదర్శన తిలకించి యాదవులకు శుభాకాంక్షలు..

యాదవుల ఐక్యత, ఆత్మగౌరవానికి సదర్ ప్రతీక: ఆదర్శ్ రెడ్డి..



పటాన్‌చెరు, నవంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

యాదవుల ఐక్యత, ఆత్మగౌరవం, తరతరాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు రామచంద్రపురం ప్రాంతంలో అంగరంగ వైభవంగా జరిగాయి. పండుగ వాతావరణంతో సందడిగా మారిన ఈ వేడుకల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని యాదవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు శ్రీనివాస్ నగర్ కాలనీ మార్కెట్ యార్డులో యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాజకీయ ప్రముఖులు భారీగా తరలివచ్చారు.జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్,ఆదర్శ్ రెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్,మెట్టు కుమార్ యాదవ్,పుష్ప నగేష్ యాదవ్,అంజయ్య యాదవ్ తదితరులు హాజరై ఉత్సవాలకు మరింత శోభ తెచ్చారు అనంతరం వికాస్ ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాల్లోనూ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాలకే ప్రధాన ఆకర్షణగా నిలిచిన దున్నపోతుల ప్రదర్శనను ఆయన ఆసక్తిగా తిలకించారు. బలిష్ఠమైన దున్నపోతులను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు.ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ,యాదవుల ఐక్యతకు,ఆత్మగౌరవానికి సదర్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత విద్య,ఉద్యోగ,వ్యాపార రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు రమేష్ యాదవ్,నవీన్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, పెద్ద సంఖ్యలో యాదవ సోదరులు పాల్గొన్నారు..



బైకులకు నిప్పు అంటించిన ఆకతాయిలు

హైదరాబాద్ : ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి వేళ ఆకతాయిలు సృష్టించిన భయాందోళన స్థానికులను తీవ్రఆగ్రాంతికి గురిచేసింది. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు దుండగులు కావాలనే నిప్పు పెట్టి పరారయ్యారు.సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి దాటిన తర్వాత నివాసాల ముందు పార్క్ చేసి ఉన్న రెండు బైక్‌లపై దుండగులు నిప్పు రాజేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఆర్పివేసే ప్రయత్నం చేసినప్పటికీ, ఒక బైక్ పూర్తిగా కాలి బూడిదవ్వగా, మరొక బైక్ పాక్షికంగా దగ్ధమైంది.ఈ ఘాతకానికి పాల్పడిన దుండగులు బైక్స్కు నిప్పు పెట్టి అక్కడ నుంచి పరారవుతున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. గతంలో కూడా ఇదే కాలనీలో సరిగ్గా ఇదే తరహాలో రెండు కార్లకు దుండగులు నిప్పు పెట్టిన ఘటనలు జరిగినట్లు కాలనీవాసులు వాపోతున్నారు. వరుసగా వాహనాలను లక్ష్యంగా చేసుకుని తగలబెడుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.బాధితుల ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

ప్రకాశం జిల్లాలో కాలి బూడిదైన ప్రైవేట్ బస్సు..

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

ప్రకాశం : జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. 33 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రయాణికులంతా సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన వలేటివారిపాలెం మండలం చుండి సమీపంలో అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 33 మంది ప్రయాణికులతో కడప నుంచి విజయవాడకు బయలుదేరింది. మార్గమధ్యంలో చుండి వద్దకు రాగానే బస్సు ముందు టైరు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్, వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. టైరు పేలిన వెంటనే మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్, ప్రయాణికులను అప్రమత్తం చేసి అందరినీ హుటాహుటిన బస్సు నుంచి కిందకు దించేశారు. ప్రయాణికులంతా కిందకు దిగిన కొద్దిసేపటికే మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ సమయస్ఫూర్తి వల్లే పెను విషాదం తప్పిందని ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పంచాయతీ ఎన్నికలకు మోగిన నగారా..

తిరుపతి : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. జిల్లాలోని 35 మండలాల పరిధిలో ఉన్న 777 సర్పంచ్‌స్థానాలు, 7,210 వార్డు సభ్యుల స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 807 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే వివిధ కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటంవల్ల 30 పంచాయతీల్లో ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించడం లేదని అధికారులు స్పష్టం చేశారు. మిగిలిన 777 పంచాయతీలకు పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 195 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. మొదటి విడతలో భాగంగా 18 మండలాల్లోని 415 పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి నవంబర్ 15న ఎన్నికల నోటీసుజారీ కానుండగా, నవంబర్ 17 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. వీటికి నవంబర్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక రెండో విడతలో మిగిలిన 17 మండలాల్లోని 362 పంచాయతీలకు నవంబర్ 29న పోలింగ్ జరగనుంది.ఆయా పోలింగ్ తేదీల్లోనే సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి, వెంటనే ఫలితాలను ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా యంత్రాంగం పేర్కొంది.

గంగాపుత్రులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

గవర్నర్ కోటాలో పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి

హైదరాబాద్ : గంగాపుత్ర సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్లోని బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగపుత్ర సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఎదురుచూస్తోందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ ఉన్నత విద్యావంతురాలని, ఎల్ఎల్ఎం పూర్తి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన వై. సత్యనారాయణ 1972 నుంచి 1978 వరకు, బి. బాలయ్య 1978 నుంచి 1983 వరకు ఎమ్మెల్యేలుగా పనిచేసి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత తరానికి కూడా రాజకీయ అవకాశం కల్పించి గంగపుత్రుల ఆత్మగౌరవానికి గుర్తింపు ఇవ్వాలని డాక్టర్ రఘు కోరారు.

ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా పీవీ సింధు

గర్వంగా ఉందన్న మంత్రి నారా లోకేశ్

హైదరాబాద్ : ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పీవీ సింధుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు ఎన్నికైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. “రెండు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు సాధించి, బ్యాడ్మింటన్ కోర్టులో నవతరానికి స్ఫూర్తిగా నిలిచిన పీవీ సింధు.. ఇప్పుడు భారత క్రీడారంగంలో కీలక నాయకత్వ బాధ్యతలను చేపట్టడం గర్వకారణం. సింధూ, మీ విజయాలను చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది” అని లోకేశ్ తన సందేశంలో కొనియాడారు. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఆమె, ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ విజయవంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కీలక బాధ్యతల్లో సింధు ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. సింధు ఈ నూతన పదవిని చేపట్టడం భారత క్రీడారంగానికి శుభపరిణామమని పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోఠి డిఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్ : కోఠి లోని డిఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ను పోలీసులు అరెస్ట్ చేసారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంటర్నిప్ చేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ పై రిలే నిరాహారదీక్షకు గ్రాడ్యుయేట్స్ దిగారు. గత 34 రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. డిఎంఈ తమకు సమాధానం చెప్పాలని ఆమె కార్యాలయం వైపు వెళ్లేందుకు గ్రాడ్యుయేట్స్ ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలలో పోలీసులకు గ్రాడ్యుయేట్స్ మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వారిని బలవంతంగా అరెస్ట్ చేసారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం నిబంధనల ప్రకారం ఎఫ్ఎంజీఈ పరీక్షలో ఉత్తీర్ణులైనప్పటికీ వైద్యశాఖ అధికారులు తమ పట్ల వివక్ష చూపుతున్నారని గ్రాడ్యుయేట్స్ ఆరోపణ. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంటర్నిప్ చేస్తున్న తమకు నెలకు కేవలం రూ. 5 వేల స్టైపెండ్ మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు.